భాషా చరిత్ర

1.1 ప్రపంచ భాషా కుటుంబాలు

నేడు ప్రపంచంలో రమారమి 6,500 భాషలు వ్యవహారంలో ఉన్నాయి. ఈ భాషలను తులనాత్మకంగా శాస్త్రీయంగా పరిశీలించి ముఖ్యమైన 10 భాషాకుటుంబాలను గుర్తించి పేర్కొన్నారు.

(i) ఇండో-యూరోపియన్ భాషాకుటుంబం

(ii) సెమిటో- హేమైట్ భాషాకుటుంబం

(iii) యూరల్-ఆల్టాయిక్ భాషాకుటుంబం

(iv) బాస్క్ భాషాకుటుంబం

(v) ఆస్ట్రో-ఏసియాటిక్ భాషాకుటుంబం

(vi) జపనీస్ భాషాకుటుంబం

(vii) సిమో- టిబెటన్ భాషాకుటుంబం

(viii) మలయో- పోలినీసియన్ భాషాకుటుంబం

(ix) బంటూ భాషాకుటుంబం

(x) ద్రావిడ భాషాకుటుంబం

1.2 ద్రావిడ భాషా కుటుంబాలు

భారత దేశంలో హిందూర్యభాషా కుటుంబం తర్వాత అధిక జనాభా కల భాషాకుటుంబం ద్రావిడ భాషా కుటుంబం. ఇప్పుడు వ్యవహారంలో ఉన్న 26 ద్రావిడ భాషలను పరిశీలించిన తర్వాత క్రీ.పూ. 4,000 సంవత్సరాల ప్రాంతంలో ఇప్పటి ద్రావిడ భాషలన్నిటికీ మూలమైన మూలద్రావిడ భాష మన అఖండ భారతదేశంలో వ్యవహరించబడేదని ద్రావిడ భాషా శాస్త్రవేత్తలు భావించారు. మూల ద్రావిడ భాషలో మాండలికాలు ఆనాటికే ఉండి ఉంటాయి. మూల ద్రావిడ భాషావ్యవహర్తలు

కాలక్రమేణ అఖండ భారతదేశంలోని దిగువప్రాంతాలకు అంటే ఉత్తర, మధ్య, దక్షిణప్రాంతాలలోకి ప్రవేశించి ఉంటారు. ఈ విధంగా మూల ద్రావిడ భాష ప్రధానంగా మూడు మూల ఉప భాషా భాగాలుగా పునర్నిర్మితాలు.

1.3. మూలద్రావిడ భాష ఉప కుటుంబాలు – ద్రావిడ భాషలు

I. మూల ఉత్తర ద్రావిడ ఉప భాషకు చెందిన భాషలు మూడు

1.బ్రాహుయీ, 2. కూడుఖ్, 3. మాల్తో. బ్రాహుయీ భాషపాకిస్తాన్‌లోని బెలూచిస్తాన్ రాష్ట్రంలో వ్యవహారంలో ఉంది.

II. మూలమధ్య ద్రావిడ ఉప భాషకు చెందిన భాషలు 12

1. తెలుగు, 2. గోండీ, 3. పెంగొ, 4. మండ, 5. కొండ/కూబి, 6. కూయి, 7. కువి, 8. కొలామీ, 9. నాయకీ, 10.పర్జీ,11. గదబ, 12.ఒల్లారి.

III. మూల దక్షిణ ద్రావిడ ఉప భాషకు చెందిన భాషలు 11

1. తమిళం, 2. కన్నడం, 3. మలయాళం, 4. తుళు, 5.కొడగు, 6. కోత, 7. తొద, 8. బడగ, 9. కొరగ, 10. ఇరుళ, 11. కుఱుంబ.

ఎఫ్ వైట్ ఎల్లిస్, కాల్డ్వెల్, ఆచార్య గంటిజోగి సోమయాజి, ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి, ఆచార్య పి.యస్. సుబ్రహ్మణ్యం ప్రభృతులు తెలుగు భాష ద్రావిడ భాషాకుటుంబానికి చెందినదని నిరూపించారు. మధ్యద్రావిడ భాషలలో తెలుగు ఒకటని ఆచార్య పి.యస్. సుబ్రహ్మణ్యంగారు నిర్ధారించారు. ఆ విధంగా మనం కూడా భావించవచ్చు.

2.1. ఆంధ్ర భాషావిర్భావం

ఆంధ్రులమైన మనం మాట్లాడే భాష ఆంధ్రభాష. ఆంధ్రభాషకు తెలుఁ-గు, తెనుఁగు అనేపేర్లు ఉన్నాయి. వీటిలో ఆంధ్ర పదానికే పూర్వకాలంలో ప్రాచుర్యం ఉంది. ఇది మొదట జాతి వాచకంగాను, తర్వాత దేశ వాచకంగాను, తదనంతరం భాషా పరంగాను వాడుకలో ఉన్నట్లు మనకు ఆధారాలు లభించాయి. క్రీ.పూ.800సంవత్సర ప్రాంతానికి చెందిన ఐతరేయబ్రాహ్మణంలో ఆంధ్రపద పర్యాయపదమైన అంధ్ర'శబ్దం ప్రయోగించబడింది 'ఏత్యేన్ధ్రాః పుండ్రాః శబరాః పులిన్దా మూతిబా ఇత్యుదన్త్యా బహవోభవన్తి వైశ్వామిత్రా దస్యూనాం భూయిషఠాః' "(ఐతరేయ బ్రాహ్మణమ్ 8 అధ్యాయః 6 ఖణ్డమ్).

'ఐతరేయ బ్రాహ్మణం'లోని శునశ్శేప ఉపాఖ్యాన ఘట్టంలోని ఈవృత్తాంతం వల్ల విశ్వామిత్రునిచే అతని పుత్రులు శాపగ్రస్తులైనట్లు తెలుస్తుంది. 'అన్ధ్ర' శబ్దం జాతివాచకంగా ప్రయోగించబడింది.

ఈ వృత్తాంతాన్ని బట్టి ఆంధ్రులు క్రీ.పూ. 1000 సంవత్సరాల ప్రాంతంలో దక్షిణా పథంలో నివసించి ఉండవచ్చు. వీరి ప్రసంగం రామాయణ మహాభారత, భాగవత మనుస్మృత్యాది సంస్కృతగ్రంథాలలో ఉంది. ప్రాకృత గ్రంథమైన గాథాసప్తశతి (క్రీ.శ. 1వ శతాబ్ది)లో అత్త, కరణి, పాణి మొదలైన అనేక తెలుగుపదాలు ప్రయోగించబడ్డాయి.

2.2. తెలుగులో మొదటి మాట

అమరావతీ స్తూపం (క్రీ.శ. 1వ శతాబ్ది)లో 'నాగబు'శబ్దం కన్పిస్తోందనీ, ఆ శబ్దంలోని '–బు' అమహద్వాచక ప్రథమైక ప్రత్యయమైన, '–ము' ప్రత్యయానికి పూర్వరూపమనీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు భావించారు. ఇటీవల విశాఖ పట్నం జిల్లా ఎలమంచిలి దగ్గర ఉన్న కొత్తూరు గ్రామంలో లభించిన క్రీ.పూ. 200 నాటి ప్రాకృత శిలాకరండికపై 'తమ్బయదానం' కన్పిస్తోంది. దీనిలో 'తమ్బయ' తెలుగుపదం. 'తమ్బయ' అనేదే తెలుగులోని మొట్టమొదటి తెలుగు పదం. ఈ పదమే తర్వాతి కాలంలో 'తమ్మయ'గా మారింది. క్రీ.శ. 3వ శతాబ్దికి చెందిన జగ్గయ్యపేట బౌద్ధ స్థూపంలోని ఇక్ష్వాకు వంశ రాజుల ప్రాకృతశాసనంలో "కాణురూరు వెలగిరి" అనేవి తెలుగు ఊళ్ళపేర్లు వెలగిరి=వెలుగూరి

జంగిలిగుండు శాసనం(క్రీ.శ.200)లో వేవురకే అనే తెలుగు పదం కన్పిస్తోంది. ఆచార్య కోరాడ మహదేవశాస్త్రిగారు సంస్కృత ప్రాకృత శిలాశాసనాలను పరిశోధించి ఆ శాసనాలలోని ఈ కింది తెలుగుపదాలను పేర్కొన్నారు.

కంగూర– "కంగూరగ్రమేయకః"(క్రీ.శ.400)

ఒంగోడు– "ఒంగోడుగ్రామాశ్చ"(క్రీ.శ.400)

కమ్బు రాజ్ఞెరువే (క్రీ.శ. 5వ శతాబ్ది) శివస్కంధ వర్మ మైదవోలు శాసనంలో (క్రీ.శ.234)"అంధాపధీయోగామో విరిపరమ్" వాక్యాన్ని బట్టి అంధ్రశబ్దం దేశ వాచిగా ప్రయోగించబడిందని స్పష్టమవుతోంది. "ఆంధ్ర మణ్డలేద్వాదశసహస్ర గ్రామసంపావిత సప్తార్థలక్ష విషయాధి పతేః" (మల్లిదేవ వర్మ నంది శాసనం క్రీ.శ.340)లోని ఆంధ్రపదం దేశవాచకం. ఆంధ్ర శబ్దం భాషాపరంగా మొట్టమొదట క్రీ. శ. 23.11.1053కు చెందిన నన్నయభట్టు రచించిన గండాచార్యుడు లిఖించిన నందంపూడి తామ్రశాసనంలో "యస్సంస్కృత కర్ణాట ప్రాకృత పైశాచికాంధ్ర భాషా సుకవి రాజశేఖర ఇతిప్రధితః సుకవిత్వ విభవేన" అని మన ఆదికవి ఆంధ్ర శబ్దాన్ని భాషాపరంగా ప్రయోగించారు.

2.3. తెలుగులో మొదటి శాసనం

కడపజిల్లా కమలాపురం తాలూకా లోని ఎర్రగుడిపాడులో ఒక శాసనాన్ని అదే జిల్లా అదే తాలూకా లోని కలమళ్ళలో మరోశాసనాన్ని ఎటికల్ముత్తురాజు బిరుదాంకితుడైన ధనంజయుడు అనే రేనాటి చోళ రాజు క్రీ.శ.575-600 కాలంలో వేయించాడు. ఇవే తెలుగులో ఉన్న సమగ్రశాసనాలు. క్రీ.శ. 575 నుంచి క్రీ.శ.1022 వరకు ఉన్నకాలాన్ని తెలుగులోని కేవలం గద్య, పద్య చంపూ మయ శాసనకాలంగా భావించవచ్చు. ఎర్రగుడిపాడు శిలా శాసనాన్ని తెలుగులోని మొట్టమొదటి శిలాశాసనంగా డాక్టర్ బూదరాజు రాధాకృష్ణగారు భావించారు.

క్రీ. శ. 575-600 మధ్యకాలంనాటి ఎట్టగుడిపాడు శిలాశాసనం.

1. స్వస్తిశ్రీ ఎరి-
2. కల్ముత్తు రాజుల్ల
3. కుణ్డికాళ్ళు(ని)వ బుకా-
4. ను ఇచ్చిన పన్నస-
5. దుజయ రాజుల-
6. ముత్తురాజులు నవ-
7. ప్రియ ముత్తు రాజులు-
8. వల్లవ దుక రాజులుసక్షి -
9. కాను ఇచ్చి(న) పన్నస-
10. కొట్టంబున పా-
11. అకు కుణ్డికాళ్ళు-
12. ళా ఇచ్చిన పన్నస-
13. ఇరవది యాదినా-
14. ల్కు మఱున్తుద్లు నేల

ఇది ఎరికల్ముత్తు రాజు అనే బిరుదుకల రేనాటి చోళరాజు (ధనంజయుడు) ఒక ఊరిలోని బ్రాహ్మణునికి కొందరు సాక్షులు కాగా, ఇచ్చిన భూదాన శాసనం. ప్రాజ్ఞన్నయకాలంలో గద్య శాసనాల కంటే పద్య శాసనాలు తక్కువే. ఇవి వివిధ ఛందస్సులలో ఉన్నాయి. గుణగ విజయాదిత్యుని సేనాపతి అయిన పండరంగడు నేటి ప్రకాశం జిల్లా ఒంగోలు తాలూకా అద్దంకి'లో క్రీ.శ.840లో ఒక శిలాశాసనం వేయించాడు. ఈ శాసనంలో తరువోజ పద్యముంది. ఇది నాల్గుపాదాలు కల, ప్రాసనియమం గల పద్యం. దీనిలో ప్రతి పాదంలోను 3 ఇంద్రగణాలు తర్వాత 1

సూర్యగణం వచ్చి మళ్ళీ 3 ఇంద్రగణాలు తర్వాత 1 సూర్యగణం వస్తాయి. ప్రతి పద్య పాదంలోని మొదటి అక్షరానికి 5వ గణం మొదటి అక్షరానికి యతి మైత్రి ఉంటుంది.

2.4. తెలుగులో మొదటి పద్యం 'తరువోజ',

"పట్టంబు గట్టిన ప్రథమంబునేఁడు
బలగర్వ మొప్పంగఁబైలేచిసేన
పట్టంబుగట్టించి ప్రభుఁబండరంగుఁ
బంచిన సామంత పదువతో బోయ
కొట్టముల్ పండ్రెండుగొని వేంగి నాఁటి
గొఱల్చి యద్రిభువ నాంకుశ బాణనిల్పి
కట్టెపు దుర్గంబు గడబయల్చేసి
కందుకూర్చె జవాడగావించె మెచ్చి"

ప్రొజ్జన్నయ యుగ శాసనాల వల్ల నాటి తెలుగు భాషాస్వరూపం స్పష్టమవుతుంది. ఈ శాసన భాషలో 10 అచ్చులూ 22 హల్లులూ ఉన్నట్లు ఆంధ్రభాషాశాస్త్రజ్ఞులు నిర్ధారించారు.

అ ఆ ఇ ఈ ఉ ఊ ఎ ఏ ఒ ఓ అచ్చులు.

క గ ఙ చ జ ట డ ణ త ద న ప బ మ య ర ఱ ల ళ వ ఋ ి స లు హల్లులు. సంస్కృత ప్రాకృత పదాల ద్వారా తెలుగులోకి మహాప్రాణాక్షరాలైన హల్లులు శ,ష ,స ,హ లు ప్రవేశించాయి. ప్రొజ్జన్నయ యుగ కాలానికి చెందిన ి కారం తర్వాతి కాలంలో రెండచ్చుల మధ్య డకారంగాను, సంయుక్త వర్ణాలైనప్పుడు 'రేఫ'గాను మారింది. ి కారం కేవలం శాసనస్థంగాను, గ్రంథస్థంగాను ఉండిపోయి నేటికాలంలో కనుమరుగయింది.

3. తెనుఁగు, తెలుఁగు పదాల వ్యుత్పత్తి

తెనుంగు, తెనుఁగు, తెలుంగు, తెలుఁగు, తెలుగు, తెనుగు పదాల పర్యాయ పదాలు, ఏకార్థకాలు, భాషావాచకాలు. తెనుంగు, తెనుఁగు పదాలను నన్నయ భట్టారకుడు తన మహాభారతంలో భాషా పరంగా ప్రయోగించాడు.

జననుతకృష్ణద్వైపా
యన మునివృషభాభి హిత మహా భారత బ
ద్ధనిరూపితార్థ మేర్పడఁ

దెనుఁగున రచియింపుమధిక దీయుక్తి మెయిన్”

(మహా భారతము ఆది. 1ఆ-16)

“భారత సంహితా రచన బంధురుడయ్యె జగద్ధితంబుగన్”, తేనెవంటి భాష తెనుగు (తేనె+అగు) అని గ్రియర్‌సన్, కాల్డ్వెల్ ప్రభృతులు పేర్కొన్నారు. దీనికి ప్రామాణ్యం లేదని ఆచార్య గంటిజోగి సోమయాజి గారు దీనిని తోసిపుచ్చారు. త్రినగ శబ్ద భవం ‘తెనుగు’ అని మరి కొందరు మరో వ్యుత్పత్తిని తెలిపారు. ఈ మూడు పదాల్లో ఏవో సరిగా నిర్ధారణకాలేదు కాబట్టి నిరావృత్తం.

దిక్కులను బట్టి భాషలపేర్లుండటం, ఆ భాషావ్యవహర్తలను వ్యవహరించటం ఉందని, ఆచార్య గంటిజోగి సోమయాజిగారు తమిళులు ఆంధ్రులను ‘వడుగర్’ (ఉత్తరాదివాడు) అని పిలవడంకలదని, తెలిపి ‘తెన్’ శబ్దానికి దక్షిణమనే అర్థం ఉందని, ‘తెన్నాడు’ పదం ద్వారా నిర్ధారించి వింధ్య పర్వతాలకు దక్షిణ దిక్కున ఉన్న మనల్ని (ఆంధ్రుల్ని) తెనుఁగు (దక్షిణం) వారు అని ఆర్యులు వ్యవహరించినట్లుగా తెలిపి ‘తెనుఁగు దిగ్వాచి’ అని నిరూపించారు. (ఆంధ్ర భాషా వికాసం పుటలు 31-34) విన్న కోటపెద్దన తన కావ్యాలంకార చూడామణి (క్రీ.శ.15వ శతాబ్ది)లో

“ధరశ్రీ పర్వత కాళే
శ్వర దాక్షారామ సంజ్ఞవఱలు త్రిలింగా
కరమగుట నంధ్రదేశం
బరుదార ద్రిలింగ దేశమనఁజనుఁగృతులన్,
తత్త్రిలింగ పదము తద్భవంబగుటచేఁ
దెలుఁగు దేశమనఁగఁదేటపడియె
వెనుకఁదెనుగు దేశమును నంధ్రుకొందఱ
బ్యాస పంచగతుల ఁబరఁగుచుండు” (నవమోల్లాసము5,6)

శ్రీశైలకాళేశ్వరదాక్షారామ త్రిలింగాల మధ్య ఉన్న ప్రాంతం త్రిలింగ దేశమనీ అదే తర్వాత కాలంలో తెనుగుగా మారిందనీ విన్న కోట పెద్దనగారు తెలిపారు. లకార నకారాల పరస్పర పరిణామం(వినిమయం) సం. మూలక > తె. ములగ > తె.మునగ, లేదు> నేడు పదాల ధ్వనిమార్పిడి మనకు పెద్దగా వింత అనిపించదు. ఉత్కళింగం, మధుకళింగం, కళింగం అనే గోదావరి నదికి ఉత్తరభాగాన ఉన్న దేశభాగాన్ని త్రికళింగమంటారనీ అదే తెలుఁగుగా మారిందనీ రాళ్లబండి సుబ్బారావుగారు కళింగదేశచరిత్ర (పుటలు 430-436)లో పేర్కొన్నారు. ఈ విధంగా తెలుఁగు, తెనుఁగు శబ్దాలకు భిన్నవ్యుత్పత్తులున్నాయి. తెలుఁగు తెనుఁగు పదాలలో

ఏది పూర్వరూపమో తెలుసుకోవాలంటే తెలంగాణా పద స్వరూపాన్ని సమీక్షిస్తే తెలుc గు'పదమే పూర్వరూపమని మనకు అవగతమవుతుంది. మహమ్మదీయ చరిత్రకారులు మన రాష్ట్రాన్ని 'తిలింగ్' అని వ్యవహరించారు. ఇప్పటికీ తురుష్కులు 'తెలంగా, తెలంగి' అని వ్యవహరిస్తారు. తిలింగమే తెలంగాణాగా వ్యవహరించబడుతోంది. 'ఆణెము' అంటే భూమి అని అర్థం. బహుశః ఇది స్థాన శబ్ద భవం కావచ్చు. 'మాగాణము' నీరు బాగా మాగినభూమి, తమిళులు నేటికీ మనలను 'తెలుంగు'లనే వ్యవహరిస్తున్నారు.

4.1. కవిత్రయాది కావ్య యుగాంధ్ర భాష - శాసన భాష (క్రీ.శ. 1022- 1800)

క్రీ.శ.1022 ఆగష్టు 16 నుండి దాదాపు 1061 వరకు వేంగీ రాజ్యాన్ని పాలించిన రాజరాజనరేంద్రుని ఆస్థాన కవి నన్నయ భట్టారకుడు ఆంధ్రమహా భారతంలోని ఆదిసభాపర్వాలను అరణ్యపర్వంలోని చతుర్థాశ్వాసం 142 వ పద్యం వరకు, రచించి ఆంధ్రభాషలో 'ఆదికవి'గా వెలుగొందాడు. తెలుగు కవులు ఈ మహాకవి మార్గాన్నే అనుసరించారు.

"ఆదిని శబ్ద శాసన మహాకవి చెప్పిన భారతంబులో
నేది వచింపcగాcబడియెనెందును దానినె కానిసూత్రసం
పాదనలేమి చేcదెలుcగుపల్కు మతొక్కటికూర్చి చెప్పcగా
రాదని దక్షవాటికవి రాక్షసుcడీ నియమంబు చేసినన్,
ఆ మూcడు పర్వాలలో
నా మాన్యcడు నుడువు తెఱcగుల రసికొని కృతుల్
దామురచించిరి తిక్కసు
ధీమణిమొదలైన తొంటితెలుcగు కవీంద్రుల్ (అప్పకవీయము 1ఆ-46,47)

ఈ విధంగా నన్నయ కవీంద్రుడు ఆంధ్రభాషకు కరదీపిక. అయన మార్గంలో నేటి వరకు ఉన్న కవులు పండితులు ధర్మమార్గంలో ప్రవర్తిస్తున్నారు. భాషమాత్రం కాలానుగుణంగా నాటి నుంటి నేటివరకు మారుతూనే ఉంది. "ప్రవాహినీదేశ్యా" అని ఆంధ్రశబ్ద చింతామణికారుడు. "ప్రవాహినీ" లోకవ్యవహార సిద్ధమైనది, దేశ్య దేశీయము" అని బాలసరస్వతీయం.

ఈ కాలంలో 'టి' కారం రెండచ్చుల మధ్య డ కారంగాను, వర్ణ నాశం జరిగి సంయుక్తాక్షరంగా మారిన సందర్భంలో రేఫగాను మారింది. కొన్ని శాసనాలలో టి కారం కన్పించినప్పటికీ కాలక్రమేణ కనుమరుగయింది. 11వ శతాబ్దిలో తెలుగు మాటలలో 'హ' వర్ణం లేదు, 'సహిండి' వంటి పదాలు 12వ శతాబ్దినుండి

దృగ్గోచరమవుతున్నాయి. "అందాదుల కలిగాగమంబు సమాసంబునందగు" (బాలవ్యా.సంధి.44)అని అందాదులకు అలిగాగమాన్ని బాలవ్యాకరణంపేర్కొగా నన్నయ భారతంలో "…. ఇందుల జీవనమేల నమ్ముదురుతత్త్వజ్ఞుల్" (ఆది.6 ఆ–245) అని 'ఇందుల' అనే చోటు ఉలగాగమ శబ్దరూపాన్ని ఆదికవి ప్రయోగించారు. నన్నయ భారతంలో ఎదంత పదం ఒక్కటి కూడా కన్పించదు. కాని తిక్కనకాలంలో ఎదంత పదాలు అనేకంకన్పిస్తున్నాయి, ఇత్వలోప రూపాలు కూడా ఉన్నాయి.

"గువ్వ గ్రద్ద దివ్యాఱుపుఁబ్రువ్వు గూబ
యిల్లు సొచ్చిన శాంతి చేయింపవలయు" (భార.ఆను. 4-119) అని కవిబ్రహ్మప్రయోగం.

11వ శతాబ్దానంతరకాలంలో హవర్ణం కన్నడ భాషా ప్రభావం వల్ల ఆంధ్ర శాసన సారస్వతాలలో ప్రచురంగా కన్పిస్తోంది. తెలుగులోని హకార ఘటిత పదాలలో చాలా భాగం కన్నడ పదాలే. హత్తు, హెచ్చు అనే క్రియా పదాలు, హంగు, హదను, హాయి, హుళక్కి, హూ, హెగ్గడి, హేమాహేమీలు, హేరాళము, హొన్నొ అనే పదాలు కన్నడ భాషనుంచి తెలుగుభాషలోకి వచ్చిన ఎరవు పదాలు.

ప్రాఙ్నన్నయయుగ కాలంలో కర్మణి ప్రయోగాలు కేవలం మూడు మాత్రమే ఉండగా ఇవి నన్నయాదికవుల కాలానికి లెక్కకుమించి ఉన్నాయి. ప్రాఙ్నన్నయ యుగానంతరకాలంలో ముఖ్యంగా 1200 సంవత్సరాల తర్వాత వర్గ పంచమాక్షరాలకు మారుగా అనుస్వారం రాయటం రమారమి పూర్తయింది. వర్గపంచమాక్షరాలకు పూర్వమున్న అనుస్వారానికి వర్ణానునాసికోచ్చారణే ఉంటుంది. కాబట్టి అనుస్వారాన్ని లేదా ఆయా వర్గపంచమాక్షరాన్ని ప్రత్యేక వర్ణంగా పేర్కొనక్కరలేదు. ఉదా. పఞ్చాదసి = పంచాదశి. శాసన భాషలోను కొన్ని చోట్ల కావ్యభాషలోను ఋవర్ణ, ఘటిత శబ్దరూపాలు రి/రు ఘటిత శబ్ద రూపాలుగా మారాయి.

ఉదా. సం. ఋషభ > తె. రిషభ
(ద.కిం.శా. 4 సంపు. శా.సం.990 క్రీ.శ.1158)
సం. ఋతు > రుతు (పైది.శా.సం.950 క్రీ.శ.1346)

శాసన భాషలోని, న్ఱు, -ణు వంటిరూపాలు కావ్య భాషలో ండు, -ఁడు గామారాయి. సంస్కృత పదాలలో ఉన్న 'జ్ఞ' అక్షరాన్ని 'గ్న'గా ఉచ్చరించటం పూర్వకాలంలోను ఆధునిక కాలంలోను ఉన్నదనటం వాస్తవం. అజ్ఞానానికి మారుగా అగ్నానమనటం మనకు తెలుసు. 'గ్న' అక్షరంతో ఉన్న పదాలను 'జ్ఞ' అక్షరంతో ఉన్న పదాలుగా ఉచ్చరించటం ఈయుగంలో ఒక విశేషం. 'ఆగ్నేయ భాగం' అని

ఉండవలసి ఉండగా 'ఆజ్ఞేయభాగం' (ద.హి.శా. సంపు. 10 శా.సం. 749 క్రీ.శ. 1583) అని కనిపిస్తోంది. దీనిని విలోమ విలేఖన పద్ధతి(Imerse) అని వ్యవహరిస్తారు. పదాదిహల్లుతో రేఫ సంయుక్తమై ఉంటే అటువంటి చోట్ల రేఫలోపం తరచుగా శాసనాల్లో కన్పిస్తోంది.

ఉదా. "క్రొత్త యింటికి" (ద.హిం.అ.సంపు. 4 శా.సం. 711 (క్రీ.శ. 1593) 'చెర్వు కింద' (ద.హిం.ఆ.సంపు. 4. అసం. గం. 686 క్రీ.శ. 1580). ఈ రెండు శాసనాలలోను క్రొత్త, కింద పదాలలోని రేఫలోపించటం మనం గమనించవచ్చు. నేడు ఇది సర్వసాధారణం, బంగారు నాణేలు అనే అర్థంలో పహిండి, పయిండి, పసిండి, పైండి పదాలు శాసనాలలో కన్పిస్తున్నాయి.

4.2. తెలుగు పదాలలోని మాండలిక పదోచ్చారణ

అటు, ఇటు, ఎటుశబ్దాలలోని ట కారానికి షకారోచ్చారణ వైదిక బ్రాహ్మణులలో నేటికీ ఉంది. ఈ ఉచ్చారణ ఈ యుగంలోనే ఉన్నట్లు అహల్యా సంక్రందనము, మన్నారు దాసవిలాస నాటకమువంటి దక్షిణాంధ్రయుగ సాహిత్యంలో "అషువలె, ఇషువలె, ఎషువలె"వంటి రూపాలు కన్పిస్తున్నాయి. దక్షిణాంధ్రయుగ భాష వాడుకభాషకు సన్నిహితమని భావించవచ్చు. ఈ విధమయిన కుల మాండలికాలు యక్షగానాలలో చోటు చేసుకున్నాయి.

4.3. తెలుగుపై పారసీ, అరబీ, ఉర్దూ భాషల ప్రభావం

మహమ్మదీయ దండయాత్రల ఫలితంగా తెలుగుపై అరబీ, ఉర్దూ, తుర్కీ, పారసీ భాషల ప్రభావం అధికంగా పడింది. కాకతీయ సామ్రాజ్యపతనానంతరం బహ్మనీరాజ్య స్థాపనతో ఈ ప్రభావం బలపడి కుతుబ్‌షాహి కాలంలో ఇతోధికమయింది. మహమ్మదీయుల భాషలలో భారతీయ భాషలకు భిన్నమైన వర్ణోచ్చారణతో కూడిన వర్ణాలు గల పదాలెన్నో ఉన్నాయి. అట్టి సందర్భాలలో వారి f,x, r,z వర్ణాల ధ్వనులకు మారుగా తత్సమీ'పో'చ్చారణ కలప, క,గ,జ వర్ణాలను లేఖనంలో ఉపయోగించారు. అంతే కాని వాటికి మారుగా లిపిలో ప్రత్యేక వర్ణాలను సృష్టించి (కల్పించి)వాడలేదు. ప్రత్యామ్నాయంగా మన వారు వాడిన వర్ణాల మౌఖికోచ్చారణ మనకు తెలియదు. తెలంగాణాప్రాంతం వారు అరబీ, పారసీ పదాల ఉచ్చారణను సరిగా ఉచ్చరించి ఉండచ్చు, కాని మిగిలిన ప్రాంతాలలోని ఆంధ్రుల ఉచ్చారణ సందేహాస్పదమే. ' f ' కారోచ్చారణ కలపదాలను దంతోష్ఠ శ్వాసోష్మస్పర్శంగా మహ్మదీయులుచ్చరించేవారు,

ఫిజ, ఫిరంగీ మొదలైనవి వాటి 'ఫి' ఉచ్చారణ ఇంగ్లీషు Coffee (కాఫీ)తో సమానం. ఈ పదాన్ని చదువు రాని వారు ఊష్మ రహితంగా'కాపీ' అని ఉచ్చరిస్తున్నారు.

శాసనభాషలోను, కావ్య భాషలోను 'f' కు మారుగా "ప,ఫ"లను వాడుతున్నారు.

5. తెలుగులోని విశేష సంధులు – సమాసాలు

అత్తునకు సంధి బహుళముగానగు"(బాలవ్యా. సంధి. 4) అని శ్రీచిన్నయ సూరి సూత్రించి "బహుళగ్రహణము చేత స్త్రీ వాచకతత్సమ సంబోధనాంతములకు సంధిలేదు" అని వృత్తి వాక్యాన్ని రచించిన "ఒకానొక చోట స్త్రీ వాచక తత్సమంబులకు సంధిగానంబడియెడు – గంగనుకాసె, నెలఁతిచ్చెను" అని వివరించారు. ఈ యుగంలో ఇటువంటి కవి ప్రయోగాలెన్నో ఉన్నాయి. చిన్నయ సూరి గారి దృష్టిలో కవిత్రయ ప్రయోగమే పరమప్రమాణం. ఆధునిక వ్యాకర్తలు ఇటువంటి ప్రయోగాలను అంగీకరించారు. "ప్రయోగశరణా వైయాకరణాఃు" (ప్రయోగాల్ని ఆశ్రయించినవారు వ్యాకర్తలు) అనేవాక్యం అందరికీ ఆదరణీయం, పరమచ్ఛాందసులయిన చిన్నయసూరి గారు కూడా "ఆర్య వ్యవహారంబులు దృష్టంబుగ్రాహ్యంబు" (బాలవ్యా. సంజ్ఞా. 23)అని సూత్రించి వ్యాకరణ లక్షణ విరుద్ధాలయిన "కఱకంఠుఁడు, ప్రాణగొడ్డము, కపిల జడలు" ప్రయోగాలను అంగీకరించి ఉదాహరణలుగా ఇచ్చారు. "లక్షణైకదృక్కులు గాక లాక్షణికులు ఈ రీతినిపెద్దల వ్యవహారమునెడనిట్టి గౌరవము చూపుట మిక్కిలి సముచితము, ప్రశంసా పాత్రము" – (కళాప్రపూర్ణశ్రీ దువ్వూరి వేంకట రమణశాస్త్రి రమణీయము పుట. 183).

6. ఆధునిక యుగాంధ్ర భాష (క్రీ.శ.1801....)

అరబీ, ఉర్దూ, తుర్కీ, పారసీభాషల పరిచయం వల్ల ఆంగ్లభాషాప్రభావం వల్ల తెలుగులో ఫ (f) వర్ణం నేడు స్థిరపడింది. ఈ వర్ణానికి ప్రత్యేక లిపి చిహ్నాన్ని ఏర్పరచుకోవాలి.

।ఫోను। ।బోను।

అనే కనిష్ఠ భేదక యుగళం(Minimal pair) తెలుగులో కన్పిస్తోంది. ఇంతేకాక ఈ ధ్వని ఆంధ్రుల కర్ణపుటాలకు విన్పిస్తోంది. నేడు ఇది తెలుగులో ప్రత్యేకవర్ణం అనటంలో ఏ సందేహమూలేదు. ఫ' కారానికి కింది గీత ఉంచి ఈ వర్ణాన్ని సృష్టించుకొని మనం ఉపయోగించుకోవచ్చు. Bank, Cash, తాటాకు వంటి రూపాలలో 'ఏ'కారోచ్చరణ విన్పిస్తోంది. ఈ అచ్చును కూడా మనం సమకూర్చుకోవచ్చు. 'ఏ' కిందగీత పెట్టటం ద్వారా ఈ ధ్వనిని సూచించవచ్చు.

Bank - బేంకు

Cash - క్రేష్

తాటాకు–తాట్రేకు

ఇటువంటి ఒకటి రెండు గుర్తుల్ని కొత్తగా ఏర్పరచుకొని c,ఱ, చే జే వంటి లిపి చిహ్నాలను విడనాడటం వల్ల ఆధునిక తెలుగు భాషాభివృద్ధికి మేలు జరుగుతుంది. ప్రాచీన తెలుగు భాషను అధ్యయనం చేయాలనుకునేవారు వాటిని వేరుగా నేర్చుకుంటారు. ఆ అవసరం లేని వారికి ఇబ్బంది కల్గించటం సముచితంకాదు.

శాసనభాషలో ఏ విధంగా లక్షణ విరుద్ధంగా సంధులు చేసే వారో అదే విధంగా ఆధునికాంధ్రభాషలో కూడా అనేక సమాసాల్లో విలక్షణంగా సంస్కృత సంధులు జరిగాయి. ఉదా. తెప్పోత్సవం(తెప్ప ఉత్సవము). ఇందులో మొదటి పదం తెప్ప తెలుగుమాట, రెండోమాట ఉత్సవపదం సంస్కృతం. ఈ రెండు మాటలూ కలిసినప్పుడు రథోత్సవంలా గుణ సంధి జరగదు. కాని తెప్పోత్సవం అనేది నేటి వాడుక భాషలో ఉంది.

కమ్యూనిస్టు + ఇతరులు> కమ్యూనిస్టేతరులు

కాంగ్రెసు + ఇతరులు > కాంగ్రేసేతరులు

ఈ పై వాటిలో మొదటి మాట ఇంగ్లీషు పదం కాగా రెండోమాట (ఉత్తర పదం) 'ఇతర' అనేది సంస్కృత పదం. ఇక్కడ గుణసంధి ప్రభావం అధికంగా కన్పిస్తోంది.

నేటి తెలుగులో పూర్వమున్న మాటలలో కొన్ని మార్పులు చోటు చేసుకున్నాయి. సర్వనామమయిన నీవు రూపంతోపాటు నువ్వు రూపం కన్పిస్తోంది. నేటి తెలుగు భాషలో ఔపవిభక్తికత లోపించటం విశేషం, పంటినొప్పి > పన్ను నొప్పి, రోకటిపోటు> రోకలిపోటు. విలోమ విలేఖనం ఉన్న దానికి ఉదాహరణ కన్ను చూపు > కంటిచూపు."క్రియా ఫలంబుకర్తృగామియగుచోఁగొను ధాతువనుప్రయుక్తంబగు" (బాలవ్యా. క్రియా.52) అని చిన్నయసూరిగారు సూత్రించి "వండుకొనుచున్నాఁడు" అని ఉదాహరించారు. "కర్తృగామిని క్రియాఫలే" అని సిద్ధాంత కౌముదికారుని ఆత్మనే పద నిర్వచనం. ఈ అర్థంలోనే కాకుండా పరస్పరార్థ (అవ్యోన్యార్థం)లో కూడా కొను ధాతువు ధాతువుకు అనుప్రయుక్తమవుతూంది. ఉదా. కొట్టు (ధాతువు) కొను > కొట్టుకొను పరస్పరం పోట్లాడు కొను, మాట్లాడు + కొను > మాట్లాడుకొను= పరస్పరం సంభాషించుకొను.

ఆధునికకాలంలో వ్యావహారిక తెలుగు భాషా ప్రయోగంతో పాటు, వాక్య ప్రధాన వచన రచనావ్యాసంగం పెరిగి వ్యాసరచన, పత్రికావాఙ్మయవ్యాప్తి, కథా, నవలా రచనలు వృద్ధిపొందాయి. రేడియో, టి.వి. చలనచిత్రాల వల్ల ఆంధ్రభాష అభివృద్ధి చెందుతోంది.

7. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం– భాషోద్యమం

మన రాష్ట్రాన్ని శ్రీమామిడి పూడి వెంకట రంగయ్యగారు చాలా చక్కగా పేర్కొన్నారు. "ప్రకృతిమాత అల్లారుముద్దు బిడ్డ తెలుగు దేశం, గహనారణ్యశ్యామల పర్వతాలు, గద్గ దనదన్నదీమతల్లులు, సుదీర్ఘ సుందరసాగరతీరం, అనూచానుయిన అనూచానమైన పుణ్యక్షేత్రాలు తెలుగు దేశాన్ని సుందర తమం చేశాయి. తెలుగు దేశంలో ఉన్నన్ని నదులు మరొక రాష్ట్రంలో లేవనవచ్చును. కృష్ణ, గోదావరి అనే పెద్ద నదులు, తుంగభద్ర, పినాకిని, వంశధార, లాంగుల్య అనే నాలుగు మధ్య తరగతి నదులు, బాహుద, శారద, గుండ్లకమ్మ, పాలేరు, మున్నేరు, స్వర్ణముఖి మొదలైన చిన్న నదులు తెలుగు నేలను సస్యశ్యామలం చేస్తున్నాయి.. కనుకనే దీనికి నదీ రాష్ట్రమని, భారత దేశ ధాన్యాగారమని పేర్లు వచ్చాయి.

ఆంధ్రప్రదేశ్ అవతరణకు బీజాలు 1900 సంవత్సరంలో శ్రీకృష్ణదేవ రాయాంధ్ర భాషానిలయం ఏర్పడటంతో ప్రారంభమై 1911లో శ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహంగారి అధ్యక్షతన జరిగిన ప్రథమాంధ్ర గ్రంథాలయ మహాసభలో కావించిన తీర్మానం మేరకు ఆంధ్రరాష్ట్ర వాంఛకు అంకురార్పణ జరిగిందని చెప్పవచ్చు.బులుసు సాంబ మూర్తి గారు కాకినాడలో 1916లో ఆంధ్రరాష్ట్ర తీర్మానాన్ని ఆమోదింపచేసుకొని, తమవాంఛను బాలగంగాధర తిలక్ గారికి నివేదించారు. 1917లో అఖిల భారత కాంగ్రెసులో భాషాప్రయుక్త రాష్ట్రాలకు అనుగుణంగా కలకత్తాలో తీర్మానం జరిగింది. 'స్వరాజ్యం లోనే స్వరాష్ట్రాలకు అనుగుణంగా కలకత్తాలో తీర్మానం జరిగింది. "స్వరాజ్యంలోనే స్వరాష్ట్రం" అనేది ఆనాటి ఆంధ్ర రాష్ట్ర నినాదం. తెలుగు మాట్లాడే వారంతా ఒకే ఒక రాష్ట్రంగా ఉండాలనేదే ఆనాటి నినాదం. 1928లో మోతీలాల్ కమిటీ భాషాప్రయుక్త రాష్ట్ర తీర్మానాన్ని ఆమోదించింది. 1947 ఆగష్టు 15న భారత దేశ స్వాతంత్ర్యానంతరం భారతదేశ ప్రథమ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ "భాషా సాంస్కృతిక ప్రాతిపదికలపై భాషా రాష్ట్ర సూత్రాన్ని భారతప్రభుత్వం ఆమోదించింది. ఆంధ్ర రాష్ట్ర నిర్మాణం అత్యంత సమంజసమైన కోర్కె. దీని నంగీకరిస్తున్నాం. నూతన భారత రాజ్యాంగంలో నమోదుచేయవచ్చు" అని తెలిపారు. కాని కార్యాచరణకు కేంద్రం, అప్పటి మద్రాసు ప్రభుత్వం శ్రద్ధచూపని కారణంగా

పొట్టిశ్రీరాములుగారు 1952 అక్టోబర్ 10న ఆమరణ నిరాహారదీక్ష చేసి స్వర్గస్తులయ్యారు. వెంటనే నెహ్రూ గారు ఆంధ్ర రాష్ట్రాన్ని అంగీకరిస్తూ పార్లమెంటులో ప్రకటన చేశారు. తత్ఫలితంగా కర్నూలు రాజధానిగా ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశంగారు ముఖ్యమంత్రిగా 1953 అక్టోబర్ 1న ఆంధ్రరాష్ట్రం ఆవిర్భవించింది.

నిజాంప్రభుత్వం అధీనంలో ఉన్న హైదరాబాదు రాష్ట్రం (The State of Hyderabad) భారతప్రభుత్వ పోలీసు చర్య వల్ల 1948 సెప్టెంబరు 13న భారతదేశంలో విలీనమయింది. ఆనాటి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావుగారి చొరవవల్ల ఆనాటి ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డిగారి విజ్ఞతవల్ల రెండు అసెంబ్లీలలో ఉన్న సభ్యుల సమ్మతి మేరకు 1956 నవంబరు 1న ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి డాక్టర్ నీలం సంజీవ రెడ్డిగారు ముఖ్యమంత్రిగా నియమితులయ్యారు.

ఆంధ్రప్రదేశ్ వైశ్యాలం 2,75,068 చదరపు కిలోమీటర్లు, జనసంఖ్య 8,46,65,533 భాషావ్యవహారంలో హిందీ, బెంగాలీల తర్వాతిస్థానాన్ని మన తెలుగు భాష ఆక్రమిస్తోంది. ఆంధ్రప్రదేశ్ సరిహద్దు రాష్ట్రాలు ఉత్తర దిశగా ఒరిస్సా, ఛత్తీస్‌గడ్, దక్షిణ దిక్కుగా తమిళనాడు, కర్ణాటకరాష్ట్రాలు, పశ్చిమదిశగా మహారాష్ట్ర, తూర్పున బంగాళాఖాతం ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ భారతదేశ ఉత్తర దక్షిణ భాగాలను కలిపేవారధిగా వెలుగొందుతోంది.

దేశసమైక్యతకు, సర్వమతసమానతకు, సంపదసృష్టికి రాజనీతికుశలతకు పేరు పడ్డ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ అలరారుతోంది.

2011 జనాభాలెక్కలను అనుసరించి జిల్లాల వారీగా ఆంధ్రప్రదేశ్ జనాభాసంఖ్యలు

కోస్తా ఆంధ్ర

జిల్లా	జనాభా
1. శ్రీకాకుళం	26,99,471
2. విజయనగరం	23,42,868
3. విశాఖపట్నం	42,88,113
4. తూర్పుగోదావరి	51,51,549
5. పశ్చిమగోదావరి	39,34,782
6. కృష్ణా	45,29,009

7. గుంటూరు	48,89,230
8. ప్రకాశం	33,92,764
కోస్తా జిల్లాల మొత్తం జనాభా-	3,12,27,786

రాయలసీమ

జిల్లా	జనాభా
1. నెల్లూరు	29,66,082
2. చిత్తూరు	41,70,468
3. కడప	28,84,524
4. అనంతపురం	40,83,315
5. కర్నూలు	40,46,601
రాయలసీమ మొత్తం జనాభా -	1,81,50,990

తెలంగాణా

జిల్లా	జనాభా
1. మహబూబ్‌నగర్	40,42,191
2. రంగారెడ్డి	52,96,396
3. హైదరాబాద్	40,10,238
4. మెదక్	30,31,877
5. నిజామాబాద్	25,52,073
6. ఆదిలాబాద్	27,37,738
7. కరీంనగర్	38,11,738
8. వరంగల్	35,22,644
9. ఖమ్మం	27,98,214
10. నల్గొండ	34,83,648
తెలంగాణా మొత్తం జనాభా	3,52,86,757

కోస్తా ఆంధ్ర జిల్లాల మొత్తం జనాభా-	3,12,27,786
రాయలసీమ మొత్తం జనాభా -	1,81,50,990
తెలంగాణా మొత్తం జనాభా -	3,52,86,757
మొత్తం ఆంధ్రప్రదేశ్ జనాభా -	8,46,65,533

8. తెలుగు భాషలోని పదజాలం (Vocabulary in Telugu language)

ప్రతి భాషలోను నిసర్గమైన దేశి పదజాలం(Indegenous vocabulars) ఉండటమే కాకుండా కొన్ని ఎరువు మాటలు (Loan words) ఉండటం జరుగుతుంది. ప్రపంచంలోని ఏ ఒక్క భాష కూడా అన్య భాషా ప్రభావానికిలోను కాకుండా లేదు. పైతృకంగా మూల భాష నుండి వచ్చిన పదాలు దేశిపదాలు. వాణిజ్యాది సంబంధాలవల్ల అన్య భాషల నుండి ఎరువు తెచ్చుకొన్న శబ్దరాశిని అన్య దేశీయ (అన్యదేశ్య)మని మనం నిర్వచించవచ్చు. సజాతీయ భాషా కుటుంబానికి చెందిన తమిళం, కన్నడం మొదలైన భాషల నుండి తెలుగులోకి వచ్చి చేరిన సాంబారు, తిరుచూర్ణం, తిరునామం, తిరుక్కురళ్, బేడలు, చిత్రాన్నం మొదలయిన పదాలు కూడా అన్యదేశ్యాలే. మూల ద్రావిడ భాష నుండి తెలుగు భాషలోకి నిసర్గంగా వచ్చిన పదాలు దేశ్యాలనీ, తమిళ, కర్ణాటాది సజాతీయ భాషల నుండి కాని ఇండో-యూరోపియన్ మొదలైన ఇతర భాషా కుటుంబాలకు చెందిన సంస్కృతం, ప్రాకృతం, హిందీ, పోర్చుగీసు, ఫ్రెంచి, డచ్చి మొదలైన భాషల నుండి కాని ధ్వని పరిణామాన్ని పొంది లేదా అర్థ విపరిణామాన్ని పొంది లేదా ధ్వన్యర్థ పరిణామాల్ని పొంది తెలుగు భాషలోకివచ్చి చేరిన పదాలను అన్యదేశ్యాలు లేదా ఎరువు మాటలు అని మనం నిష్కర్షగా నిర్వచించవచ్చు.

ఆంధ్ర వ్యాకర్తలు తెలుగు పదజాలాన్ని ఏ విధంగా విభజించారో పరిశీలిద్దాం. తెలుగు భాషలో వెలసిన మొట్ట మొదటి వ్యాకరణ గ్రంథం, మూల ఘటిక కేతన రచించిన ఆంధ్ర భాషా భూషణము. కేతనగారు ఆంధ్ర పదాలను ఈ కింది విధంగా విభజించారు:

‘తత్సమంబునాఁగఁదద్భవంబననచ్చు
తెనుఁగునాఁగమఱియు దేశ్య మనఁగ
గ్రామ్య భాషనాఁగఁగలవైదుతెఱఁగులు
వేఱెవేఱెవాని విస్తరింతు(ఆంధ్రభాషా భూషణము-19)

తత్సమం, తద్భవం, అచ్చ తెలుగు, దేశ్యం, గ్రామ్యం అని ఐదు రకాలుగా తెలుగు పదాలను కేతన విభజించారు. కేతన దృష్టిలో తత్సమ పదం అంటే సంస్కృత ప్రాతిపదిక శబ్దంపై కేవలం, తెలుగు విభక్తి చేర్చటం అని చెప్పి “వనము, ధనము, పురుషుడు” అనే ఉదాహరణల్ని ఇచ్చారు. సంస్కృత ప్రాకృత భవాలను తద్భవాలని ‘ఆంధ్రభాషా భూషణము’ పేర్కొంది.

"లచ్చి యనలక్ష్మి పేరగు
నచ్చంబననచ్ఛమునకునభిధానమువి
వ్వచ్చుఁడు బీభత్యుఁడువి
ద్వచ్ఛయమనునిట్టి తెనుఁగు తద్భవమయ్యెన్"
(పైది - 21)

సంస్కృతం	ప్రాకృతం	తెలుగు
లక్ష్మీ	లచ్ఛీ	లచ్చి
అచ్ఛ	అచ్ఛ	అచ్ఛము
బీభత్స	బీభచ్ఛ	వివ్వచ్చుఁడు

కేతన పేర్కొన్న మూడు పదాలూ ప్రాకృత భవాలుకావటం ఏ ఒక్కటి సంస్కృతసమం కాకపోవటం మనం గమనించవలసిన విషయం. తర్వాతి సీస పద్యంలో కేతనగారు ప్రాకృత సంస్కృత భవాలను పేర్కొన్నారు.:

"అర్ఘంబెయగ్గునదీర్ఘికడిగ్గియ
గుణములు గొనములు కులముకొలము
స్నిగ్ధంబునిద్దంబు శ్రీసిరి భంగంబు
బన్నంబు దిశదెస భాష బాస
యక్షులు జక్కులు యముఁడు జముండగు
నాజ్ఞప్తియానతి యాజ్ఞయాన
ద్యూతంబు జూదంబు దోషంబుదోసంబు
ముగ్ధుండు ముగుదుండు ముఖము మొగము
పసదనంబు ప్రసాదనంబసముయశము
సమ్మెటయ చర్మయష్టి కర్జంబుకార్య
మీ రసంబీర్ష్యవేరంబు వైరమిట్టి
పగిది పల్కులు తద్భవపదములయ్యె" (పైది 22)

సంస్కృత శబ్దం	ప్రాకృత శబ్దం	తద్భవ పదం
అర్ఘ	అగ్ఘ	అగ్గువ
దీర్ఘికా	దిగ్ఘిఆ	డిగ్గియ
గుణ	గుణ	గొనము
కుల	కుల	కొలము
స్నిగ్ధ	ణిద్ధ	నిద్దము

శ్రీ	సిరీ	సిరి
భజ్గ	భంగ	బన్నము
దిశా	దిసా	దెస
భాషా	భాసా	బాస
యక్ష	జక్ఖ	జక్కు(లు)
యమ	జమ	జముఁడు
ఆజ్ఞప్తి	ఆణత్తి	ఆనతి
ఆజ్ఞా	ఆణ	ఆన
ద్యూత	జూద	జూదము
దోష	దోస	దోసము
ముగ్ధ	–	ముగుదుఁడు
ముఖ	–	మొగము
ప్రసాదన	–	పసదనము
యశస్	–	అసము
చర్మయష్టి	–	సమ్మెట
కార్య	కజ్జ	కజ్జము
ఈర్ష్యా/ఈర్ష్య	–	ఈరసము
వైర	వేరమ్	వైరము

ఈ సీస పద్యంలో తద్భవాలకు ఉదాహరణలుగా ఇచ్చిన 23 పదాలలోను సంస్కృత భవాలు కేవలం 6 మాత్రమే. తద్భవాలలో ప్రాకృత భవాల సంఖ్య అధికంకావటం విశేషం. తర్వాతి పరిశోధనల్లో ఇదే విషయం వెల్లడి కావటం విశేషం. 13వ శతాబ్దంలో ఇంతటి విశేష పరిశోధన కావించి, మూల ఘటిక కేతనార్యులు తమ ఆంధ్ర భాషా భూషణము ద్వారా ప్రాకృతభవ పదాలన్నీ విశదపరచటం ముదావహం. ఇదే ఆధునిక వైకృతపద స్వరూప నిరూపణకర్తలకు కరదీపిక కావటం విశేషం.

"తలనెలవేసవి గుడిమడి
పులిచలిమడుఁగూరుపేరు బూరుగుమగవాఁ
డలుకయని యెల్లవారికిఁ
దెలిసెడియా పలుకు లచ్చ తెనుగనఁ బరఁగున్" (పైది 23)

"తెల నెల...." వంటి పదాలు అచ్చ తెలుగు పదాలనటంలో సందేహంలేదు.

"ఎఱుగువనెత్తమ్మి..." మొదలయిన పదాలను దేశితెనుఁగులని కేతనార్యులు పేర్కొన్నారు. అచ్చ తెలుఁగు మాటలకంటే ఇవి కొంచెం భిన్నమయిన, అందరికీ అర్థంకాని పదాలుగా మనం భావించవచ్చు. వంచాకుమయ్య తోపించాకుమయ్య....అషువలె ఇషువలె "వంటి పదాలు గ్రామ్యాలని" పేర్కొని గ్రామ్యమనఁగ "నెవ్వరు మెప్పురు" (పైది 27) అని గ్రామ్య ప్రయోగం గ్రాహ్యంకాదని వారు తెలిపారు.

ఆంధ్ర శబ్ద చింతామణి కర్తలు తెలుగు శబ్దాలను " తజ్జా సమాచ దేశ్యా గ్రామ్యా చేయం చతుర్విధాభవతి, ప్రకృతి ద్యయ జాతజ్జా, తుల్యాతు సమా, ప్రవాహినీ దేశ్యా" (ఆం.శ. చింసంజ్ఞా.41) తద్భవం, తత్సమం, దేశ్యం, గ్రామ్యం అని నాలుగు విధాలుగా విభజించారు. ఈ పద్ధతినే శ్రీ పరవస్తు చిన్నయసూరి గారు పాటించారు.

"సంస్కృత ప్రాకృత తుల్యంబగు భాష తత్సమంబు" (బాలవ్యా. సంజ్ఞా 19) అని సూరిగారు సూత్రించి సంస్కృత సమాలకు

సంస్కృతము	సంస్కృతసమము
రామఃరామఃరామఃర

బాలవ్యాకర్త తద్భవాల గురించి "సంస్కృత ప్రాకృత భవంబగు భాష తద్భవంబు" (బాలవ్యా. సంజ్ఞ. 20)
అని సూత్రించి సంస్కృత భవాలకు

సంస్కృతము	**సంస్కృతసమము**
ఆకాశః	ఆకసము
కుడ్యమ్	గోడ
చన్ద్రః	చందురుఁడు
తమఙ్గః	తమగము
తామరసమ్	తామర
నారాచః	నారసము
నిభః	నెపము, నెవము
ముఖమ్	మొకము, మొగము

ఇత్యాదులుదాహరించి ప్రాకృత భవాలకు

సంస్కృతము	**ప్రాకృతము**	**ప్రాకృతభవము**
అఙ్గారః	ఇంగాలో	ఇంగలము
అప్సరాః	అచ్ఛరా	అచ్చర
ఆశ్చర్యమ్	అచ్చరం	అచ్చెరువు
పఞ్చశత్	పణ్ణాసా	పనస
పృథివీ	పుఢవీ	పుడమి
ప్రయాణమ్	పయాణం	పయనము

మొదలయిన వాటిని ఉదాహరించారు.

"త్రిలింగ దేశ వ్యవహార సిద్ధంబగు భాష దేశ్యంబు" (బాలవ్యా. సంధి. 21) అని సూరిగారు సూత్రించి "ఊరు, పేరు, ఇల్లు, ముల్లు, కోట, పేట, దూడ, మేడ, కోఁత, లేఁత తావి, వోవి ఇత్యాదులయినది" అని ఉదాహరించారు. చిన్నయసూరిగారు పేర్కొన్న పై శబ్దాలన్నీ దేశ్యాలే. పై పదాలలోని కోట పేట, పదాలను అనవసరంగా ప్రౌఢ వ్యాకర్త వివాదగ్రస్తం చేసి "కోట పేటలు వైకృతములు" (ప్రౌఢవ్యా. సంజ్ఞా. 11) అని సూత్రించారు. సూరిగారు పేర్కొన్న 'పేట' (హారం, సరం) నిర్బిందుకం. ఇక 'కోట' శబ్దం కేవలం ద్రావిడ శబ్దం. "తమిళం 'కోట్టై' కోట, మలయాళం 'కోట' పైది; కన్నడం 'కోటె' పైది, కువి 'కోట' "(DED1984. Entry Ref:2207) అని టి.బరో, ఎమ్.బి. ఎమినో గార్లు

నిరూపించారు. సంస్కృతంలోని కోట్ట శబ్దం ద్రావిడ భాషల నుండి గ్రహించబడింది. కోటల నిర్మాణం ద్రావిడుల ప్రత్యేకత. తెలుగు కోట < మూ.ద్రా. కోట్టయ్: "లక్షణ విరుద్ధంబగు భాష గ్రామ్యంబు" (బాలవ్యా. సంధి.22) అని బాలవ్యాకర్త సూచించి "వస్తాఁడు, తెస్తాఁడు, వచ్చేవి, తెచ్చేవి, వచ్చే వాఁడు, తెచ్చేవాఁడు, వచ్చేటివాఁడు, తెచ్చేటివాఁడు, ఈ భాష ప్రయోగంబున ననర్హంబు" అని గ్రామ్యభాషను నిరసించారు. ఈ గ్రామ్య పదాలలో అరసున్నలుండటం విశేషం. అరసున్నలు పెట్టినంత మాత్రాన గ్రామ్యం గ్రాహ్యం కాదని సూరి హృదయం.

9. తెలుగులోని పాశ్చాత్య దేశభాషాపదాలు

ఆంధ్ర భాషా భూషణము, ఆంధ్ర శబ్ద చింతామణి, కావ్యాలంకార చూడామణి మొదలైన లక్షణ గ్రంథాలలో అన్య దేశ్య శబ్దాల గురించిన ప్రసంగంలేదు. అన్యదేశ్యాలను మొట్టమొదట పేర్కొన్న లాక్షణికుడు వికృతి వివేకకారుడు: "ప్రాకృతే తద్భవే చాపి చజ్దన్త భవౌ స్మృత్, అహేయమన్య దేశీయం యత్తదేవ ప్రయుజ్యతే" (వికృతి వివేకః సంజ్ఞా.9 శ్లో.) "అన్య దేశ్యపదము రసము కలిగినచోనాపదము ప్రయోగింపఁబడుచున్నది. ఠీవి, ఠవర ఇత్యాదులు" అని కవి జన మండన వివరణ. అన్యదేశ్య శబ్దరాశిని ప్రయోగించటం తప్పు కాదని వికృతి వివేకకారుని ఉద్దేశం. అరబీ పదమైన 'త అనీజ్' తెలుగులో 'తాయెతు' గా మారి ప్రయోగించబడింది. ఈ పదాన్ని వికృతి వివేకకారుడు "డోలా భూషోత్తరీయాణిని నైత్యం నాస్తి మధ్యయః "(వికృతి వివేకః సంజ్ఞా.23) అనే కారికలో పేర్కొన్నాడు. ఈ కారికను పరవస్తు చిన్నయ సూరిగారు తమ వ్యాకరణంలో "ఊయేలపయ్యెద తాయెతులంద్రిక్క నామంబులందు యాకుందాలవ్య వక్రయోగంబు లేదు"(బాలవ్యా.ప్రకీర్ణ.3) అని సూత్రీకరించారు. పూర్వకవులు అనేకాన్య దేశ్యపదాలను ప్రయోగించారు. పారసి 'తరాజు' శబ్ద భవమైన 'త్రాసు' పదాన్ని కవిబ్రహ్మ తిక్కన సోమయాజి "త్రాసులంబోని చిత్తంబుల తోడుత ప్రజవివాదములెడ భయములుడిగి.."(భార. శాంతి. 2ఆ-375) అని ప్రయోగించారు. ఆనాటి జనవ్యవహారంలో త్రాసుశబ్దం వాడుకలో ఉన్నదనటానికి ఈపూరు శిలాశాసనంలోకి "ఓగిరానకుత్రాసు నాయమువల్న".(ద.కిం.శ.

సంపు.10. క్రీ.శ.1278) వాక్యం సాక్ష్యం.శ్రీనాథమహాకవి అనేకాన్యదేశ్యాలను ప్రయోగించారు.

"పూజారి వారి కోడలు
తాజాఱఁగ బిందె జాఱి దబ్బున పడియేన్

మైజారు కొంగు తడిసిన
బాజారే తిరిగి చూచి పక్కున నవ్వెన్"

పారసీ శబ్దాలయిన మిజర్, బాజార్‌లు తెలుగులో మైజారు, బాజారు శబ్దాలుగా రూపొంది కవి సార్వభౌములచే ప్రయోగించబడ్డాయి. వసు చరిత్రకారుడు "నానావజీర సేనామాన భేదనుండును..."(వసు. 1ఆ. 14); "తరుణ చరణ భాగిబ్రామ శరణ" (పైది. 4ఆ. 140) అని వజీర, ఇబ్రామ పదాలను ప్రయోగించాడు. అనాస, బాతు, బాల్చా, పీపా, బుడత గీచు మొదలైన పోర్చుగీసు భాషా పదాలు, కళావరు (dడచ్ క్లోవర్) వంటి డచ్చి పదాలు, మదాము వంటి ఫ్రెంచి పదాలు, రైలు, రోడ్డు, పోస్టాఫీస్, టి.వి. సినిమా, రేడియో, వాచి, కీ, స్టేషను, మాస్టారు, సర్, ప్రొఫెసర్, కాలేజి, యూనివర్సిటీ, సెల్ వంటి ఇంగ్లీషు మాటలు, ఎన్నో తెలుగులో ప్రవేశించి నేటి ఆంధ్ర ప్రజల వాడుకలో ఉన్నాయి.

10. మన తెలుగులిపి

ప్రపంచంలోని అన్ని భాషలు మొదట ధ్వని రూపంలోనే ఉంటాయి. అమరకోశంలోని వాగ్వర్గంలో భాషా శబ్ద వ్యుత్పత్తిని లింగాభట్టుగారిచ్చారు. "బ్రాహ్మీతు భారతీ భాషా గీర్వాగ్వాణీ సరస్వతీ"(అ.కో. 1కాం. 1శ్లో.) అని అమరకోశం. "భాష్యతే ఇతి భాషా. 'భాష' వ్యక్తాయాంవాచి భాషింపcబడునది" అని గురుబాల ప్రబోధిక. పలకబడేదే భాష. భాషలో భావవ్యక్తీకరణ ముఖ్యం. పిట్టలు కూస్తుంటాయి, కుక్కలు మొరుగుతుంటాయి. ఏనుగులు ఘీంకరిస్తుంటాయి. సింహాలు గర్జిస్తుంటాయి. గుర్రాలు సకిలిస్తాయి. గాడిదలు ఓండ్రపెడుతుంటాయి. సహజ ప్రవృత్తులవల్ల ఆ జీవులు అవిధంగా ప్రవర్తిస్తుంటాయే తప్ప తమ భావాలను సంపూర్ణంగా వ్యక్తీకరించలేవు. కాబట్టి వాటికి భాషించే శక్తి లేదు. మానవులకు భాషించే శక్తి ఉంది. వారు తమ భావాలను వాగ్రూపంగా వ్యక్తం చేయకలుగుతారు. ఈ వాగ్రూపంగా వెలువడే ధ్వనుల సమాహార రూపమైన భాష క్షణికం, తత్క్షణం నశించేది. వాగ్రూపమైన భాషను సాధ్యమయినంత ఎక్కువకాలం స్థిరంగా ఉంచేందుకు - కాలగర్భంలో తత్క్షణం కలిసిపోకుండా ఉంచేందుకు-మానవులు లిపిని కనిపెట్టారు. దీనికి అక్షరం అని పేరు పెట్టారు. క్షరమంటే నశించేది, అక్షరం అంటే నశించనిది అని పదవ్యుత్పత్తి. వాగ్రూప ధ్వనులకు, లేఖనరూపంలో ఉన్న లిపి 'సంజ్ఞ'లకు అక్షర శబ్దం వాడబడుతుంది.

"యేనాక్షర సమామ్నాయమధిగమ్య మహేశ్వరాత్
కృత్స్నం వ్యాకరణం ప్రోక్తం తస్మైపాణినయేనమంః"

అనే శ్లోకంలో అక్షర శబ్దం ధ్వని పరంగానే ఉంది. మహేశ్వరుడు 14 పర్యాయాలు ఢక్కను మోగించగా 1. అ ఇ ఉణ్; 2. ఋ ఌ క్; 3. ఏ ఓ ఙ్; 4. ఐ ఔ చ్; 5. హ య వ ర ట్; 6. ల ణ్; 7. ఞ మ ఙ ణ న మ్; 8. ఝ భ ఞ్; 9. ఘ ఢ ధ ష్; 10. జ బ గ డ ద శ్; 11. ఖ ఫ ఛ ఠ థ చ ట త వ్; 12. క ప య్; 13. శ ష స ర్; 14. హ ల్ అనే ధ్వనులు వెలువడ్డాయి. దీనిని విమర్శించి చూడగా శివ సూత్ర జాలమైంది. ("నృత్తావసానే నటరాజ రాజోననాద ఢక్కాలనమపఞ్చ + వారమ్, ఉద్ధర్తుకామః సనకాది సిద్ధాన్ ఏతద్వి మర్శే శివ సూత్రజాలమ్" అనేది ప్రమాణం): " అక్షరాలు దిద్దుతున్నాడు" అనే వాక్యం లిపి పరంగా ఉన్న అర్థానికి ప్రమాణం.

లిపిని ప్రపంచంలో మొదట ఎవరు కనిపెట్టారు? అనే విషయంలో భిన్నాభిప్రాయాలున్నాయి. ప్రాచీన పారశీకులు లిపిని కనిపెట్టినట్లుగాను, వారు బాణాల వంటి గుర్తులతో లిపిని రాసేవారని తెలిపి పాశ్చాత్య పండితులు దానికి 'క్యూనీఫారం' లిపి అని పేరుపెట్టారు. భారతీయ లిపి కూడా చాలా ప్రాచీనమైనదని, చిత్ర లిపి నుంచే ఆవిర్భవించిందని పలువురి అభిప్రాయం. పాణినీయులు లిపిని గురించి తెలిపారనటానికి 'యవనాల్లిప్యామ్ అనే వరరుచి వార్తికను బట్టి మనకు తెలుస్తోంది. భారతీయుల లిపి బ్రాహ్మీలిపి. ఆశోకుని శిలా శాసనాలలో బ్రాహ్మీ ఖరోష్ఠి లిపులు రెండూ కన్పిస్తున్నాయి. బ్రాహ్మీ లిపి ఎడమవైపు నుంచి కుడివైపుకు, ఖరోష్ఠి లిపి కుడివైపు నుంచి ఎడమవైపుకు చదవాల్సి ఉంటుంది. మనదేశంలో బ్రాహ్మీ లిపి వాడుక ప్రచురమైంది. నేటి భారతీయ లిపులన్నీ దాదాపు బ్రాహ్మీ లిపి నుండి ఆవిర్భవించనవే. లిపి ద్వారా విద్యా వ్యాప్తి త్వరగా జరుగుతుందని గుర్తించిన సిద్ధార్థుడు (గౌతమ బుద్ధుడు) (క్రీ.పూ.563 – క్రీ.పూ. 483) లిపిని ప్రోత్సహించి విద్యా వ్యాప్తికి దోహదపడ్డాడు. మన తెలుగు లిపి కూడా బ్రాహ్మీ లిపి నుండి ఉద్భవించినదే. మన రాష్ట్రంలో గుంటూరు జిల్లా భట్టిప్రోలులో అశోకుడు చేయించిన స్తూపస్థాపకుల పేర్లున్న 3 బరిణలు దొరికాయి. మన తెలుగు లిపి దక్షిణ బ్రాహ్మీలిపి నుండి ఆవిర్భవించింది. మన వేంగీ లిపి పూర్వకాలంలో వాడుకలో ఉండేది. ఈ లిపి కన్నడ తెలుగు లిపులకు మూలం. క్రీ.శ. 10వ శతాబ్దికి దక్షిణ బ్రాహ్మీ లిపి సంపూర్ణంగా వికసించి తెలుగు-కన్నడ లిపిగా పరిణమించింది. కడపజిల్లా కమలాపురం తాలూకా ఎర్రగుడిపాడు గ్రామంలో ఎరికల్ముత్తు రాజు బిరుదాంకితుడైన ధనుంజయుడు చెన్న కేశవస్వామి దేవాలయం పక్క రాతిపై క్రీ.శ.575-600లో వేయించిన శాసనం తెలుగు లిపిలో చెక్కబడ్డ సమగ్ర శాసనం. బర్నెల్ పేర్కొన్న తెలుగు-కన్నడ లిపుల సంధికాలం 10,11,12 శతాబ్దాలు. 14వ శతాబ్దంలో తెలుగుకన్నడ లిపులు వేరయ్యాయి. కన్నడ

లిపిలోని 'టి' కారం అందులో మాత్రం నిలిచి ఉంది. రెండు లిపులలోను అర డజను అక్షరాలు తప్ప మిగిలిన తెలుగు కన్నడ అక్షరాల లిపులు దాదాపు సమానంగా ఉన్నాయి. తెలుగు కన్నడ లిపుల ఏకీకరణవల్ల ఆంధ్ర కర్ణాటక ప్రజల సంబంధాలు దృఢతరమవుతాయి.

"ప్రతి పద్యమునందుఁజమత్కృతిగలుగం జెప్ప నేర్తు..."(విజయ. 1ఆ-50) అని ప్రతిజ్ఞ చేసిన చేమకూర వేంకటకవి తెలుగు లిపి సౌందర్యాన్ని శ్లేషల్లో శ్లాఘించాడు;

"కన్నులు దీర్ఘముల్ నగుమొగంబవురా! తలకట్టు తమ్మిపూ
పున్నమచందమామలకు బ్రొక్కిలి చక్కఁదనంబుఁజెప్పఁగా
నున్నదే? మేలు బంతులుపయోధరముల్, చిఱుకన్నుసున్నయౌ
నెన్నిక కెక్కువాత ఫలమివ్వర వర్ణినికిన్నిజంబుగన్".

(విజయవిలాసము 2 ఆ. 104)

11. తెలుగులోని సంఖ్యా వాచకాలు

భాషాస్వరూప నిరూపణకు సంఖ్యా వాచక పరిశీలన అత్యవసరం. తెలుగు సంఖ్యావాచక పదాలను తెలుసుకుందాం. తెలుగు సంఖ్యా వాచక పదాలకు సోదర ద్రావిడభాషా పదాలకు సారూప్యం ఉంది. మరే ఇతర భాషా కుటుంబాలలోని సంఖ్యా వాచక పదాలతోను వీటికి సంబంధంలేదు. ఈ అధ్యయనం మూల భాషల పునర్నిర్మాణానికి సహాయంపడుతుంది. సంఖ్యా వాచకాలు కొన్ని భాషలలో విశేషణాలుగాను, విశేష్యాలుగాను మార్పు లేకుండా తమిళ కన్నడ భాషల్లో లాగే ఉంటాయి. కాని తెలుగు భాషలో మహత్తుల్లో ఒక రకంగాను అమహత్తుల్లో ఇంకోరకంగాను ఉంటాయి. మహత్తుల్లో ఇద్దరు బాలురు, ముగ్గురు బాలురు అని ఉండగా అమహత్తుల్లో రెండు కాయలు, మూడుకాయలు అని సంఖ్యా వాచకాలు మార్పు లేకుండా ఉంటాయి. ఈ విధమైన భేదాల్ని మనం గుర్తించాలి. ఏకార్థంలో తెలుగులోని మూలరూపం 'ఒక' అనేది. తెలుగులోని మరో విశేషణరూపం 'ఒండు'. దీనికి మూలరూపం 'ఒరు'. 'ఒకఁడు' అనేది మహద్విశేష్యరూపం కాగా 'ఒకటి' అనేది అమహద్విశేష్యరూపం. మూల తెలుగు ఒరుక మ్రూల ద్రావిడం ఒర.

తెలుగులో 'రెండు' (ద్విర్థం) ఉంది. తమిళంలో 'ఇరణ్డు'. తె. రెండు మూల ద్రావిడం *ఇరణ్డ్. దీని విశేష రూపం ఈర్. తెలుగులో 'ఈరేడు' (2×7=14) లో ఇది విశేషణంగా ఉంది.

తెలుగులో మూఁడు/మూడు (త్ర్యర్థం) దీనిని తమిళరూపం. మూన్ఱు. దీనికి మూల ద్రావిడ రూపం *మూన్ట్. విశేషణరూపంలో తెలుగులోని మూడులోని 'ఁడు'

లోపించి ద్విత్వమవుతుంది. ముప్పది. మూలద్రావిడంలోని *నాల్ తెలగులో 'నాలుగు' అవుతుంది; దీని విశేషణరూపం 'నలు' తెలుగులోని 'ఐను' (పఞ్చార్థకం)కు మూ.ద్రా. *చయ్(5) మూలరూపం. తెలుగులోని అయిదు/ఐదు శబ్దం కన్నడం నుంచి గ్రహించబడింది. తెలుగులోని 'ఆఱు'(6)కు మూలరూపం. మూలద్రావిడం *చాత్త్. తెలుగులో దీని విశేషణ రూపం 'అఱు'. మూలద్రావిడ *ఏటొ తెలుగులో 'ఏడు' గా మారింది. విశేషణ రూపంలో వర్ణవ్యత్యయం జరిగి డె-బ్బది అయింది.

అష్టార్థంలో తెలుగులో ఎనిమిది. తమిళం ఎణ్. మూ.ద్రా. *ఎణ్. మూలద్రావిడ భాషావ్యహకర్తలకు తెలిసిన పెద్ద సంఖ్య ఇదే. తొమ్మిది, పది, నూఱు, వేయి సంఖ్యలు కాలక్రమంలో ఏర్పడినవే అని గ్రహించాలి.

ఆధునిక భాషాశాస్త్రం

1.1. భాషానిర్వచనం

అమరకోశంలోని వాగ్వర్గంలో వాక్కుకు పర్యాయ పదంగా భాషాశబ్దాన్ని అమరసింహ మహాపండితులు "బ్రూహ్యేతు భారతీభాషాగీర్వాణీ సరస్వతీ" (అ.కో. 1 కాండః వాగ్వర్గః శ్లో.) శ్లోకంలో ఇచ్చారు. "భాష్యతే ఇతి భాషా, 'భాష' వ్యక్తాయాం వాచి. భాషింపఁబడునది" అని గురుబాలప్రబోధికాకారులు లింగా భట్టారకుల పదవ్యుత్పత్తి. మాట్లాడటం ద్వారా మానవుడు తన మనోగతభావాల్ని ఇతరులకు అర్థమయ్యేటట్లు దాదాపు వ్యక్తీకరించగలుగుతాడు. ఆకలి, దాహం, కోపం, ఉద్రేకం, మనోభావాలు మనిషి మెదడులో పుట్టినప్పుడు వాటిని ఇతరులకు స్పష్టంగా అర్థమయ్యేటట్లు తెలిపే వాగ్రూప ప్రక్రియే భాష. ఈ భాష సృష్టిలో మనిషికి మాత్రమే క ల అపూర్వ సాధనం.

ప్రపంచంలో ఉన్న పలు భాషలను పరిశీలించి భాషకు కొన్ని నిర్వచనాల నిచ్చారు. "Language is a purely human and non-instinctive method of communicating ideas, emotions and desires by means of a system of voluntary produced symbols" (Language, p.8) (మానవుడు (మనిషి) తన మనసులోని భావాలను ఉద్రేకాలను, కోరికలను సహజ ప్రవృత్తుల ద్వారా కాకుండా స్వేచ్ఛాప్రాదుర్భావ చిహ్నాపద్ధతి ద్వారా ప్రకటించేదే భాష) అని ఎడ్వర్డ్ సపీర్ భాషను నిర్వచించాడు. "A language is a system of arbitrary vocal symbols by means of which a social group co-operates" (An outline of Linguistic Analysis, P.1) (సంఘ సమూహం పరస్పర వ్యవహారం కోసం ఉపయోగించుకొనే స్వచ్ఛంద మౌఖిక చిహ్నాల వ్యవస్థ భాష) అని బ్లాక్, బెర్నార్డ్ & ట్రేగర్ భాషను

నిర్వచించారు. ఈ భాషా నిర్వచనాన్ని ప్రపంచంలో దాదాపు అందరూ అంగీకరిస్తున్నారు.

1.2. భాషాశాస్త్రం

భాషను శాస్త్రీయంగా వర్ణించి తెలిపే శాస్త్రం భాషాశాస్త్రం. కాలక్రమేణ కొన్ని మార్పులు చోటుచేసుకున్నా భాష స్థిరంగా ఆ భాషావ్యవహర్తలు లేదా ఆ జాతి జీవించి ఉన్నంతకాలం ఉంటుంది. భాషావ్యవహర్తలందరూ ఏ కారణం లేదా కారణాల చేతనైనా పరిత్యజించినప్పుడు మాత్రమే ఆ భాష అంతరిస్తుంది. సజీవంగా ఉన్న (వ్యవహారంలో ఉన్న) భాషను లేదా భాషలను లేదా శాసనాల ద్వారా లిఖితాధారాల వల్లకాని లభ్యమయ్యే భాషను లేదా భాషలను పరిశీలించి శాస్త్రీయ పద్ధతులతో రూపొందించి నిర్ధారించేశాస్త్రమే భాషాశాస్త్రం. ఇతర ప్రాణుల నుండి మనుషులను పృథక్కరించేది (వేరు పరిచేది) భాష. మానవుల ప్రసార సాధనమైన ఈ భాష ఇతర జీవుల ప్రసార సాధనాల కంటే ఏ విధంగా భిన్నమైనదో పరిశీలిద్దాం.

1.3. భాషాలక్షణాలు

ప్రపంచంలోని ప్రాచీన సాహిత్యాలను పరిశీలిస్తే పిట్టలు, జంతువులు, చేపలు, క్రిమికీటకాదులు మాట్లాడినట్లుగా కొన్ని మానవులతో సంబంధ బాంధవ్యాలను పెట్టుకొన్నట్లుగా అనేక కథలు, గాథలు మనకు లభిస్తున్నాయి. ప్రపంచ సాహిత్యంలో ఇటువంటివి కవితా పరంగాను, నీతిబోధ కోసమో మతాల ప్రచారం కోసమో కేవలం కల్పితాలు, యథార్థాలు కావు. వీటిని భాషాశాస్త్రవేత్తలు అంగీకరించరు, మాట్లాడే శక్తి మనుషులకు మాత్రమే ఉంది.

భాషావిర్భావం మానవావిర్భావం ఒకేసారి జరిగిందని చెప్పచ్చు. భాషలేని మానవ సంఘం ఊహాతీతం. అందుకే "without language human society is unthinkable....." అని బ్లాక్, ట్రేగర్లు 'An outline of Linguistic Analysis' (p.1) లో పేర్కొన్నారు. మానవులందరూ హోమో సెపియన్స్ (*Homosapiens*) తెగకు చెందినవారు. వీరు క్రీ.పూ. 30,000 సంవత్సరాలకు పూర్వం భూమిపై ఉండేవారు. వీరికి మాత్రమే భాషాజ్ఞానం ఎంతోకొంత ఉండేది. ఈ జ్ఞానం తర్వాతికాలంలో పరిణత స్థితికి చేరుకుంది. మానవేతర జీవరాసుల వార్తాప్రసార విధానాన్ని సమీక్షిస్తే తప్ప మానవ భాషాప్రాముఖ్యం అర్థం కాదు.

1.4. మానవేతర ప్రాణుల వార్తా ప్రసారం

తేనెటీగల జ్ఞానం తేనెటీగలే తేనెను పట్టుకువచ్చి తోటి తేనెటీగలకు తేనె ఎక్కడ

ఉందో, ఏ దిక్కులో ఉందో, ఎంత దూరంలో ఉందో తన తోక ఉన్న దిక్కులో తేనె ఉన్నదన్న విషయాన్ని నృత్యంద్వారా తెలియచేస్తుంది. మిగిలిన ఇతర తేనెటీగలు ఈ తేనె విషయాన్ని గ్రహించి తేనె ఉన్న చోటికి పోతాయి. తేనె విషయంలో తేనెటీగలకు తేనెను గూర్చి తెలిపే సామర్థ్యం, గ్రహించే సామర్థ్యం ఉంది. ఈ సామర్థ్యం పుట్టుకతోటే వీటికి జీన్స్ ద్వారా సహజ ప్రవృత్తి వల్ల కలిగింది. ఇవి తేనెను గూర్చి తప్ప మరే ఇతర విషయాన్ని గూర్చి తెలపలేవు, ఏ ఇతర విషయాన్ని గ్రహించలేవు. కాబట్టి ఇది భాషాజ్ఞానం కాదు.

మువ్వెన్నెముక స్టికిల్ బేక్ (Three spined stickleback) అనే చేపలు వసంతకాలంలో ఇతర ప్రాంతాల నుండి తమ ప్రాంతాల జలాలలోకి ఏ ఇతర జాతి చేపలు రాకుండా నిరోధించి తమ ప్రాంతంలోని ఆహారం తమ జాతి చేపలకు మాత్రమే సరిపోయేటట్లు చూసుకుంటూ, తమను తాము రక్షించుకుంటాయి. ఈ చేపలమైథున ప్రవర్తనలో కొంత వార్తా ప్రసార సరళి కన్పిస్తోంది. మగ స్టికల్ బేక్ ఆడ స్టికిల్ బేక్ చేప అండభరిత గర్భాన్ని ముక్కుతో రుద్దగా ఆడస్టికిల్‌బేక్ అండ విసర్జన కావిస్తుంది. తర్వాత మగ స్టికల్ బేక్ వీర్యాన్ని విసర్జిస్తుంది. ఈ మైథున ప్రక్రియ సహజ సిద్ధం, జన్యుజనితం. ఈ చేపల దగ్గర మైథున సంబంధి వార్తా ప్రసార సాధనం తప్ప మరే వార్తా ప్రసారసాధనంలేదు. కాబట్టి ఇది భాష కాదు.

గిబ్బన్లు అనే కోతులలో వార్తా ప్రసార సాధనం కొంత ఉంది. కోతులు, ఆవులు, ఎద్దులు, పిట్టలు పాములు మొదలైన ప్రాణులు తమకు భయాదులు కలిగినప్పుడు అరుస్తాయి. ఏవేవో ధ్వనులు చేస్తుంటాయి. ఈ ధ్వనులను గ్రహించిన తోటి ప్రాణులు పరస్పరం దగ్గరగా రావటమో, దూరంగా పారిపోవటమో చేస్తుంటాయి. మిగిలిన ప్రాణుల అరుపులు దాదాపు కొంచెం స్వరభేదంతో ఒకేరకంగా ఉంటాయి. కాని గిబ్బన్లు మాత్రం శత్రువులను చూచినప్పుడు ఒక రకంగాను, మిత్రులను చూచినప్పుడు ఇంకోరకంగాను, ప్రమాదకర సర్పాలను చూచినప్పుడు వేరే విధంగాను దాదాపు 15 రకాలుగా అరుస్తాయి. తోటి గిబ్బన్లు (Gibbons) ప్రతిస్పందిస్తాయి. ఈ వార్తాప్రసారాలు 15 ధ్వనులకే పరిమితం కావటంవల్ల ఇది భాష కాదు. ఈ గిబ్బన్ల వార్తా ప్రసార సాధన శక్తి కూడా జన్యు పరంగా వచ్చినదే, పరిమితమైనదే.

చీమలలో రసాయనిక సంకేతాలున్నాయి. చీమలు ఆహారాన్ని గుర్తించి అక్కడి నుంచి వచ్చేటప్పుడు దారి పొడుగునా ఒక రసాయనాన్ని వదుల్తాయి. మిగిలిన చీమలు ఆ వాసనను బట్టి ఆ దారిలో వెళ్ళి ఆహారాన్ని గుర్తిస్తాయి. చీమల ఐక్యం మెచ్చదగింది.

వీటి వార్తా ప్రసారం కేవలం ఆహారానికి మాత్రమే పరిమితం. ఇది కూడా జీన్స్ ద్వారా వచ్చిన జ్ఞానమే.

"ఆహార నిద్రాభయమైథునములు ప్రాణులకు సహజ లక్షణాలు" అనే వాక్యం పూర్తిగా సత్యం. పై ప్రాణులలోని వార్తా సాధకాలు కేవలం పుట్టుకతోనే సహజ సిద్ధంగా సిద్ధించాయి. ఇవి పరిమితంగా ఉండటం వల్ల ప్రత్యేక భాషలు కావు.

ఏంథ్రోపోఇడ్ ఏజ్ (Anthropoid age) హోమోసెపియన్లు(Homosapiens) కొన్ని లక్షల సంవత్సరాలకు పూర్వమే విడిపోయి భావ ప్రకటనను భాష ద్వారా వ్యక్తీకరించ గల మనిషి దాదాపు క్రీ.శ. 30,000 సంవత్సరాలకు పూర్వం మాత్రమే ఆవిర్భవించాడు.

1.5. మానవుల భాషా లక్షణాలు

మానవ భాషకు ఏడు ముఖ్య లక్షణాలున్నాయి. ఈ ఏడు లక్షణాలూ ఉన్న వార్తా ప్రసార విధానం మరే ఇతర ప్రాణికి లేదు. ఈ ఏడు లక్షణాలు

1. ద్వైవిధ్యం (Duality)
2. ఉత్పాదకత (Productivity)
3. స్వచ్ఛందత (Arbitrariness)
4. పరస్పర విషయ వినిమయం (Interchangeability)
5. ప్రత్యేకత (Specialization)
6. స్థానదూరత (Displacement)
7. సాంస్కృతిక ప్రసారం (Cultural Transmission)

1.5.1.ద్వైవిధ్యం (Duality)

ప్రతి భాషలోను వర్ణాల నిర్మాణక్రమం క్రమభద్ధంగా నియతితో ఉంటుంది. ఏ రెండు భాషలూ ఒకే నిర్మాణ క్రమంలో ఉండవు. ఇదేవిధంగా పదాలు క్రమపద్ధతిలో కలిసిపోయి వాక్యనిర్మాణం ప్రతి భాషలోను జరుగుతుంది. 1.వర్ణాత్మక వ్యవస్థ, (Phonological system) 2. వ్యాకరణ వ్యవస్థ (Grammatical system) అనే రెండు వ్యవస్థలు ప్రతి భాషలోను ఉంటాయి. దీనినే ద్వైవిధ్యమంటారు. ప్రసార వ్యవస్థకు(Communicative system)ఈ ద్వైవిధ్యం ముఖ్య సూత్రం. వర్ణాలు అర్థభేదకతను సూచిస్తాయి. ఏ భాషలోనైనా 60కి మించి వర్ణాలుండవు. ఇవి 15కు తక్కువ ఉండవు. తేనెటీగలలో ఇది లేదు.

1.5.2. ఉత్పాదకత (Productivity)

భాషను నేర్చుకున్న తర్వాత మనిషి తానెప్పుడూ వినని, పలకని వాక్యాలను నిర్మించుకుని వ్యవహరిస్తాడు. ఈ నూతన వాక్య నిర్మాణం వక్తకూ శ్రోతకూ అవగతమవుతుంది. దీనినే ఉత్పాదకత అంటారు. ఈ ఉత్పాదకతకు అనుకరణ, సామ్యం కారణాలు. ఎవరైనా ఏవైనా తప్పుగా మాట్లాడితే పెద్దలు సవరిస్తారు. పిల్లలు 'sleep' కు బహువచనంగా 'sleeps' అని పలికితే పెద్దలు 'sleep' కు బహువచనం 'sleep' మాత్రమే అని పెద్దలు సవరిస్తారు. ఆంగ్ల బాలురు కూడా ఇటువంటి తప్పులను చేస్తున్నారు. హాకెట్‌గారి ఈ వాక్యాన్ని గమనించండి. "Regulaized plurals like mens sleeps are probably or produced by every english - speaking child" (A Course in modern linguistics p.425) ఉత్పాదకతలో నూతన వాక్య సృష్టి ఉంటుంది. మానవులలోను తేనెటీగలలోను ఉత్పాదకత ఉంది. మరే ఇతర జీవులలోను ఈ ఉత్పాదకత లేదు.

1.5.3. స్వచ్ఛందత (Arbitrariness)

శబ్దానికి అర్థానికి ఉన్న సంబంధం ఆయా భాషా వ్యవహర్తలేర్పరచుకొన్న సంకేతం. ఈ భాషా సంకేతాల్ని ఆయా భాషా వ్యవహర్తలు స్వచ్ఛందంగా ఏర్పరచుకున్నారు కాబట్టి ఈ భాషా లక్షణాన్ని స్వచ్ఛందత అన్నారు. శబ్దానికి అర్థానికి సంబంధం ఉండి ఉంటే ప్రపంచంలో ఇన్ని భాషలేర్పడేవికాదు. 'తల' అనే తెలుగు పదాన్ని తీసుకోండి. 'త్‌అ ల్‌అ' అనే నాలుగు ధ్వనులు తలలో ఉన్నాయి. ఈ పదంలోని 'త్' ధ్వనికి 'ముక్కు' అనీ, 'అ'కారానికి 'కన్ను' అనీ రెండో 'అ' కారానికి 'చెవి' అనీ 'ల్'కు 'నోరు' అనీ అర్థంకాదు. మొత్తం 'తల' పదానికి శీర్షం (head) అని అర్థం. 'తల'కు ఆ అర్థం కలగటం కేవలం తెలుగువారి సంకేతం. వైయాయికులు 'శక్తని పదమ్' అని పదాన్ని నిర్వచించి 'అస్మాత్సదాదయమర్థోబోద్ధవ్య ఇతి ఈశ్వర సంజ్ఞేతశక్తిః ' అని శబ్ద శక్తిని వివరించారు. వారు ఈశ్వర సంకేతాన్ని భావించగా, భాషాశాస్త్ర వేత్తలు మానవ సంకేతమని పేర్కొన్నారు. కాకి, డింగ్ డాంగ్ వంటి ధ్వన్యనుకరణ శబ్దాలు భాషలో కొన్ని ఉన్నా, అవి పరిమితం. భాషలలోని స్వచ్ఛందతా లక్షణం వల్లనే అమూర్త పదార్థాల్ని సూచించగల్గుతున్నాం.

1.5.4. పరస్పర విషయ వినిమయం (Interchangeability)

వార్తాప్రసరణ శక్తి కల వ్యక్తి వార్తాగ్రహణ శక్తికల వ్యక్తిగా కూడా ఉంటాడు. వ్యక్తులు మాట్లాడేటప్పుడు ఆ మాటలను పరస్పరం అర్థం చేసుకుంటారు. ఒకడు

'పాము' అని పలకగానే శ్రోత వెంటనే 'ఎక్కడ?' అంటాడు. వక్త అదిగో చెట్టు కింద' అంటాడు. దీనినే పరస్పర వినిమయమంటారు.

1.5.5.ప్రత్యేకత (Specialization)

వార్తాప్రసరణలోను ప్రేరణ ఉంటుంది. ప్రేరణకు ప్రతి క్రియకు సహజ సంబంధం లేకపోతే వార్తాప్రసరణలో ప్రతిక్రియ ఉన్నట్లుగా భావించాలి. ప్రేరణ ప్రతిక్రియలకు సన్నిహిత సంబంధం ఉంటే ఆ వ్యవస్థలో ప్రత్యేకత లేనట్లుగా భావించవచ్చు. ప్రేరణ ప్రతిక్రియలకు ప్రత్యేక సంబంధం లేకపోతే ఆ వ్యవస్థలో ప్రత్యేకత ఉన్నట్లుగా భావించాలి. గృహిణి పాత్రల చప్పుడువల్ల భోజనం సిద్ధమైందని భర్త, పిల్లలు ఇంటిలోని వారు గ్రహిస్తే అందులో ప్రత్యేకతలేదు. పాత్రల చప్పుడుకు భోజనం సిద్ధం కావటానికి సంబంధం ఉంది. కాబట్టి ఇక్కడ ప్రత్యేకత లేదు. ఏ చప్పుడూ లేకుండా 'భోజనానికి రండి' అని గృహిణి పిలిస్తే అక్కడ ప్రత్యేకత ఉంది. ఇది భాషాలక్షణం. మానవేతర జీవులలో ఇట్టి ప్రత్యేకత లేదు.

1.5.6.స్థానదూరత (Displacement)

మనిషి భూత భవిష్యద్వర్తమాన కాలాలను గురించి సంభాషించగల్గుతాడు, మానవేతర జీవరాసులు ఈ త్రికాలాలను గురించి ఏ విధంగాను ముచ్చటించలేవు. తేనెటీగలయినా తాము చూచిన మధు సమాచారాన్ని సహచర మధుపాలకు కొన్ని గంటల తర్వాత తెలపలేవు. మానవేతర జీవజాలం ఉద్రేకం, భయం మొదలైనవి కల్గినప్పుడు సహజ ప్రవృత్తుల ద్వారా మాత్రమే కొన్ని పరిమిత విషయాలను గుర్తించి వార్తా ప్రసారాన్ని అందించగల్గుతాయి. స్థాన దూరతాలక్షణం పరిమితంగా తేనెటీగలలో మాత్రమే ఉంది. స్థానదూరత భాషకు ప్రధాన లక్షణం.

1.5.7.సాంస్కృతిక ప్రసారం (Cultural Transmission)

మానవుడు సంఘజీవి. ఆచారవ్యవహారాలు, సంప్రదాయాలు తరతరాలుగా మానవులకు సంక్రమించినట్లుగానే, భాషావార్తా ప్రసార సంప్రదాయాలు కూడా తరతరాలుగా ఒకరినుండి ఒకరికి సంక్రమిస్తాయి. ఇది వంశ పారం పర్యంగా జీన్స్ ద్వారా సంక్రమిస్తుందని నేడు నిర్ధారించబడింది. మానవులకు భాషా వ్యవస్థ వంశపారం పర్యంగా రావటంతోపాటు సాంస్కృతికంగా అధ్యయనం ద్వారా సంక్రమించటం మరో విశేషం. 'అధీతి బోధాచరణ ప్రచారాలు' మానవుల సాంస్కృతిక ప్రసార లక్షణం.

మనుషులకు కల జ్ఞాపకశక్తి అపూర్వమయింది. ఇటువంటి జ్ఞాపక శక్తి మానవేతర జంతుజాలానికి లేదు.

2.1 భాషోత్పత్తి క్రమం – ప్రాచ్య పాశ్చాత్య సిద్ధాంతాలు

మానవులను ఇతర జీవకోటి నుండి పృథక్కరించేది (నేర్పరచేది) భాష. 'మన' జ్ఞానే ధాతువు నుండి 'మను' శబ్దం పుట్టింది. మను సంతతివారు మానవులు. మనుష్యత్వాధ్యారోపం వల్ల నైషధ, కాదంబరీ, పంచతంత్రాది గ్రంథాలలో పశుపక్ష్యాదులు సంభాషించినట్లు తెలిపినప్పటికీ మానవేతర జంతు సంతతి మాట్లడలేదు. వాటికి మాట్లాడే సామర్థ్యం లేదా మాటలను, వాక్యాలను అర్థం చేసుకొనే శక్తిలేదు. సృష్టిలోని ప్రతి ప్రాణి తన మనోవికారాలను మౌఖిక ధ్వనుల ద్వారా వ్యక్తం చేయగల్గుతుంది. మనిషి తన మనోభావాలను దాదాపు సంపూర్ణంగా మౌఖిక ధ్వనుల ద్వారా వ్యక్తం చేయగల్గుతుండగా, మానవేతర జీవులు సహజ ప్రవృత్తులతో కొన్ని పరిమిత ధ్వనుల ద్వారా మనోవికారాలను కొంత మేరకు మాత్రమే వ్యక్తం చేయగల్గుతున్నాయి. నాగరికతా పునాదికి భాష ముఖ్యం. ఈ భాష ఎప్పుడు ఎలా పుట్టిందనే విషయంలో భాషా శాస్త్రజ్ఞులు వివిధ సిద్ధాంతాలను ప్రతిపాదించారు. ప్రాచీన కాలంలో భాషోత్పత్తి కారకాలైన శబ్దాలకు దైవత్వం ఆరోపించబడింది. మొట్టమొదట ప్రాచ్య, పాశ్చాత్యుల భాషోత్పత్తి సిద్ధాంతాలను తెలుసుకుందాం.

2.1.1. భాషోత్పత్తి క్రమం – ప్రాచ్య సిద్ధాంతాలు

భాష మహేశ్వరదత్తమని భారతీయ వైయాకరణుల సిద్ధాంతం. ఇందుకు ఈ కింది నందికేశ్వర కారిక ప్రమాణం.

"నృత్తావసానే నట రాజ రాజో
ననాదధక్కాం నవ పంచవారమ్
ఉద్ధర్తు కామః సనకాది సిద్ధా
నేత ద్వివర్శే శివసూత్రజాలమ్"

(నట రాజ రాజ (మహేశ్వరుడు) నృత్తావసానం (నృత్తం ముగింపు)లో సనకసనంద సనత్కుమారసనత్సు జాతాది సిద్ధులను ఉద్ధరించాలనే కోరికతో ధక్కను 14 పర్యాయాలు మోగించాడు. ఈ 14 పర్యాయాల ధక్కా నినాద వివర్శ యంద మహేశ్వర సూత్రీసమూహం విన్పించింది). ధక్కా సంభూత ధ్వనులు పాణిని మహర్షికి కూడా విన్పించాయి. ఈ మహర్షి కూడా సనకాది సిద్ధులలో ఒకడు. మహేశ్వర ధక్కా ధ్వనులు అక్షరాలుగా పాణిని మహర్షికి విన్పించాయి. ఈ విషయాన్ని ఈ కింది శ్లోకం స్పష్టం చేస్తోంది.

"యేనాక్షర సమామ్నాయ మధిగమ్య మహేశ్వరాత్
కృత్స్నం వ్యాకరణం ప్రోక్తం తస్మై పాణినమేనమః"

(మహేశ్వరుని నుండి అక్షర సముదాయాన్ని పొంది మొత్తం వ్యాకరణం ఎవనిచే చెప్పబడిందో, ఆ పాణిని మహర్షికి నమస్కారం). మహేశ్వర ఢక్కా నవపంచనాదాలు పాణినికి 14 ధ్వని సూత్ర ధ్వనులుగా విన్పించాయి.

1. అ ఇ ఉ ణ్
2. ఋ ఌ క్
3. ఏ ఓ ఙ్
4. ఐ ఔ చ్
5. హయవరట్
6. లణ్
7. ఞమ�ఙణనమ్
8. ఝ భ ఞ
9. ఘ ఢ ధ ష్
10. జ బ గ డ ద శ్
11. ఖ ఫ ఛ ఠ థ చ ట త వ్
12. క ప య్
13. శ ష స ర్
14. హ ల్

వీటినే శివ సూత్రజాలమనీ, మహేశ్వర సూత్రాలనీ వైయాకరణులు పేర్కొన్నారు.

ఋగ్వేదంలో భాషా స్వరూపం విశదీకరించబడింది. ఋగ్వేద కాలం క్రీ.పూ. 1500 సంవత్సర ప్రాంతం. ఈ కింది మంత్రం వల్ల ఆనాటి వారి మేధాసంపద వ్యక్తమవుతుంది.

"చత్వారి శృంగాత్రమో అస్య పాదా
ద్వే శీర్షే సప్త 'హస్తా' సో అస్య
త్రిధా బద్ధో వృషభో' రోర వీతి
మహో 'దేవో' మ'ర్త్యాం ఆ 'వివేశ" (ఋగ్వేదః 4-58-3)

అగ్ని దేవతా పరమైన ఈ మంత్రాన్ని వైయాకరణులు శబ్ద శాస్త్ర పరంగా వ్యాఖ్యానించారు. అందరి మానవుల లోపల, అంతర్యామిగా ఉన్న ఈ శబ్దంలోని వృషభం లౌకిక వృషభం కంటే విలక్షణమైందని ప్రతిపాదించబడింది. ఈ విలక్షణమైన

వృషభానికి నాలుగు కొమ్ములు అని చత్వారి పద జాతాని నామాఖ్యా తోపసర్గనిపాతాశ్చ తానీమాని భవన్తి" అని నిరుక్తంలో యాస్కాచార్యుడు 1. నామం (సుబంతం), 2. ఆఖ్యాతం (తిజన్తం), 3. ఉపసర్గ, 4. నిపాతం అని పదాలు నాలుగు రకాలు. దీని పాదాలు మూడు – 1. భూతకాలం, 2. భవిష్యత్కాలం, 3. వర్తమానకాలం. రెండు తలలు 1. నిత్యం (స్ఫోట), 2. కార్యం (వైఖరి). ఏడు చేతులు = 7 విభక్తులు. మూడు విధాలుగా కట్టబడ్డది. వక్షఃస్థలంలో, కంఠంలో, శిరస్సులో కట్టబడ్డది. వృషభః = కోర్కెలను తీర్చే వృషం; ర్రోరవతి = శబ్దం చేస్తోంది; దేవః = శబ్ద దేవత, గొప్ప శబ్ద దేవత; మర్త్యాన్ = మనుష్యులను; ఆవివేశ ఆవేశించింది. అఖండమయిన నిత్యమయిన స్ఫోటను వాక్యపదీయ గ్రంథంలో ప్రతిపాదించిన మహా పండితుడు భర్తృహరి. "అనాది నిధనంబ్రహ్మశబ్ద తత్త్వం యదక్షరమ్, వివర్తతేఽర్థభావేనప్రక్రియా జగతోయతః" (వాక్యపదీయమ్ 1-1) అనే శ్లోకంలో భర్తృహరిచేశబ్దతత్త్వం బ్రహ్మ రూపంగా భావించబడింది. వాక్కు పరా,పశ్యంతీ, మధ్యమా వైఖరులనే భేదాలతో ఉందని గమనించవచ్చు. ఇందులోని వైఖరీ వాక్కు మనమందరమూ తాలవ్యాది స్థానాలచే జిహ్వాది కరణాలతో ఉద్దేశించిన అర్థాన్ని తెలపటానికి ఉచ్చరిస్తున్నాం. వైయాకరణులు ఈ వాక్కునే శబ్దమని పేర్కొన్నారు. వాక్యాలు నోటినుండి పుట్టే ప్రతి ధ్వనిని వాక్కుగా అంగీకరించకుండా అర్థస్ఫోరక పద వాక్య నిర్మాణ దోహదకర శబ్దాలనే వాక్కుగా అంగీకరించారు. ప్రకృత భాషాశాస్త్రాధ్యయనానికి మధ్యమా, పశ్యంతీ, వాక్కులు అంత సహాయకారులు కావు. పరా వాగ్రూపమయిన నిత్యమయిన సత్యమయిన వాగ్రూపాన్ని భర్తృహరి మొదలైన వ్యాకర్తలు అంగీకరించి, నిరూపించారు, వైయాయికుల మతం, ఆప్తవాక్యం శబ్దః (ఆప్తవాక్యం శబ్దః) అని శబ్దానికి అన్నం భట్టు నిర్వచనం. యథార్థ వక్తను ఆప్తుడంటారు. భాషకు వాక్యం మూలం. "వాక్యంతు పదసమూహః" (పదసమూహమే వాక్యం) అని అన్నంభట్టు వాక్య నిర్వచనం. "శక్తం పదమ్. అస్మాత్సదామమర్థో బోద్ధవ్య ఇతీశ్వరసంకేతశ్శక్తిః" (శక్తి కలది శక్తం. ఈ పదం నుంచి ఈ అర్థం తెలుస్తుందనే ఈశ్వర (దైవ) సంకేతమే శక్తి (సామర్థ్యం). భాషా సంకేతాలు ఈశ్వర ప్రసాదితాలనే భావం తార్కికులలో ఉంది.

2.1.2. భాషోత్పత్తి క్రమం – పాశ్చాత్య సిద్ధాంతాలు

మానవుడు తన హృదయంలోగల భావాలను బయటికి ఎట్లా వ్యక్తం చేయగలుగుతున్నాడు అనే ప్రశ్న మన దేశంలోనే కాకుండా బేబిలోనియా, ఎస్సేరియా, గ్రీకు, రోము మొదలైన పాశ్చాత్య దేశ పండిత మండలిని కూడా బాధించింది. భాష

బేబెలు ప్రసాదమే అని బేబిలోనియా వారు భావించారు. గ్రీకు తత్త్వవేత్తలు శబ్దార్థాల సంబంధం స్వాభావికమా? సాంకేతికమా? అనే విషయాన్ని చర్చించారు. వారిలో కొందరు పద పదార్థాల సంబంధం స్వాభావికమని వాదించగా, మరికొందరు పద పదార్థాల సంబంధం మానవ కల్పితమని వాదించారు. భాష దైవదత్తమని కొందరు తెలపగా, మరికొందరు మానవులొకచోట గుమిగూడి పదాలకు పదార్థాలను సూచించేటట్లుగా కొన్ని సంకేతాలను ఏర్పరచుకున్నారని భావించారు.

2.1.2.1. బౌవౌ సిద్ధాంతం (Bowvow theory)

ఈ సిద్ధాంతాన్ని మేక్స్‌ముల్లర్ (Maxmuller) ప్రతిపాదించాడు. శునకాది జంతుజాలం చేసే ధ్వనులను బట్టి ఆ జంతువులకు ఆ పేర్లు కలిగాయని ఈ సిద్ధాంత సారాంశం. కుక్కలు 'బౌవౌ' అని అరుస్తాయి కాబట్టి కుక్కకు ఆ పేరు వచ్చిందనీ, 'కాకా' అని కూసే పిట్టలను కాకులన్నారనీ, 'కూకూ' అనే వాటిని సంస్కృతంలో 'కోకిల' అనీ ఆంగ్ల భాషలో 'cuckoo' అని జనులు వ్యవహరిస్తారనీ ఈ 'బౌవౌ' సిద్ధాంతవాదులు వాదిస్తారు. 'పీపీ' (ఈల) మేక, గుర్రం వంటి కొన్ని శబ్దాలు భాషలో ఉన్నా,వీటి సంఖ్య అత్యల్పం. కాబట్టి ఈ సిద్ధాంతం సమాదరణీయం కాదు.

2.1.2.2. పూపూ సిద్ధాంతం (The pooh pooh Theory)

దీనిని ఆశ్చర్య వాదసిద్ధాంతం (Interjectional Theory) అని కూడా అంటారు. మనిషి ఆశ్చర్య సుఖదుఃఖాదులు కల్గినప్పుడు 'ఓహోహో, ఆహా, హా' మొదలయిన ధ్వనులను చేస్తాడు. పాశ్చాత్యులు భావవ్యక్తీకరణ సమయంలో 'పూపూ' అనేధ్వనులను చేస్తారు. కాబట్టి ఈ వాదానికి ఆపేరు వచ్చింది.

శ్రమాదుల వల్ల కలిగిన గ్లానిని తట్టుకోవటానికి మనిషి'పూ' (pooh) అని కానీ, 'పిష్' (fish)అని కానీ, మరో విధంగా కానీ పలుకుతాడని డార్విన్ పేర్కొన్నాడు. తెలుగులోని 'ఓహో, ఆహా' పదాలు ఇటువంటివే. ఇటువంటి పదాలను భాషాశాస్త్రవేత్తలు ప్రత్యేకపదాలుగా గుర్తించరు. ఈ శబ్దాలు ప్రాంతాన్ని బట్టి మారుతుంటాయి.

2.1.2.3. డింగ్ - డాంగ్ సిద్ధాంతం (The Ding-Dong Theory)

పద పదార్థాలకు ఒక విధమైన రహస్య సంబంధముంటుందనీ ఈ అతీతసంబంధమే భాషాసృష్టికి కారణమనీ మేక్స్‌ముల్లర్ (Maxmuller) డింగ్ –డాంగ్ సిద్ధాంతం. ఇది 'ఊహా కల్పితం' కాబట్టి తిరస్కరించబడింది.

2.1.2.4. సంసర్గ సిద్ధాంతం (The Contact Theory)

మానవులు సంసర్గాన్ని తమలోతాము పెంపొందించుకోవాలనే దృష్టితో భాషను సృష్టించుకున్నారని రెవెస్జ్ (Revesz) ప్రతిపాదించారు. మొదట ధ్వనుల ద్వారా తర్వాత కేకల ద్వారా అనంతరం భాషద్వారా మనిషి తన భావాలను వ్యక్తం చేసి ఉంటాడని వీరి భావన భాష ఏ విధంగా ఉద్భవించిందో సరిగా వీరు చెప్పలేదు.

2.1.2.5. స్వతస్సిద్ధ సిద్ధాంతం (The Innate Theory)

భాషోత్పత్తి క్రమంలోని ప్రాచ్యపాశ్చాత్య పండితుల వివిధ సిద్ధాంతాలను పరిశీలించాం. ఈ సిద్ధాంతాలన్నిటిని తోసిపుచ్చి 19వ శతాబ్దంలో నోమ్ చోమ్స్కి(Naom Chomskm) ప్రతిపాదించిన స్వతస్సిద్ధ సిద్ధాంతం (The innate Theory) అందరు భాషాశాస్త్రజ్ఞుల చేత నేడు అంగీకరించబడింది. ఆ ఆధునిక భాషాశాస్త్రవేత్త మానవ భాష స్వతస్సిద్ధంగా జీన్స్ (Genes) ద్వారా మానవులకు మాత్రం సంక్రమిస్తుందని, అ భాష పరిసరప్రాంతవాసుల భాష వల్ల పూర్తిగా మొదట ప్రభావితమవుతుందని విశదీకరించాడు. ఈ స్వతస్సిద్ధ సిద్ధాంతం మానవ భాషావిర్భానికి కారణమని నేడు అందరూ అంగీకరిస్తున్నారు.

3.1. ప్రపంచ భాషల పదాంశాను గుణ వంశాను గుణ భాషా వర్గీకరణ

ప్రపంచ భాషల వర్గీకరణలో నాలుగు పద్ధతులున్నాయి. అందులో మొదటిది భౌగోళిక భాషా వర్గీకరణ (Geological Classification). భూగోళంలో అయిదు ఖండాలున్నాయి. 1. అమెరికా ఖండం, 2. ఆఫ్రికాఖండం, 3. యూరప్ ఖండం, 4. ఆసియాఖండం, 5. ఆస్ట్రేలియాఖండం. ఈ పై ఖండాలలో వ్యవహరించే భాషలను పరిశీలించి అమెరికాఖండ భాషలనీ, ఆఫ్రికాఖండ భాషలనీ, యూరప్ ఖండభాషలనీ, ఆసియా ఖండభాషలనీ, ఆస్ట్రేలియాఖండ భాషలనీ వ్యవహరించారు. మన భారతదేశంలోని భాషలను ఆసియాఖండ భాషలుగా గుర్తించారు. కాని భారతదేశంలోనే హిందూర్య భాషలు, ముండా భాషలు, ద్రావిడ భాషలు మొదలయిన పరస్పర సంబంధం లేని భాషలెన్నో ఉన్నాయి. ఈ భౌగోళిక వర్గీకరణకు శాస్త్రీయతలోపించింది.

రెండోది భాషావర్గీకరణ ధ్వన్యాత్మక వర్గీకరణ (Phonological Classification) భాషలోని ధ్వనులను (అక్షరాలను-వర్ణాలను) బట్టి చేసే వర్గీకరణ. భాషలోని ధ్వనులను మాత్రమే తీసుకొని భాషలను వర్గీకరించలేం. ఈ వర్గీకరణ పరిణతరూపమే ప్రపంచభాషల పదాంశానుగుణవర్గీకరణ (Morphological Classification) మూడో వర్గీకరణ పదాంశాను గుణ వర్గీకరణ(Morphological or Typological Classi-

fication) పదాంశాల నిర్మితిని వ్యాకరణాంశాలపై దృష్టిపెట్టి ఈ విధమైన వర్గీకరణను భాషాశాస్త్రవేత్తలు భావించారు. ఈ వర్గీకరణ ధ్వన్యాత్మక వర్గీకరణ కంటే మేల్తరం. నాల్గో వర్గీకరణ ప్రపంచభాషల వంశానుగుణ వర్గీకరణ (Geneological or genetic of classification of world languages) రెండు లేదా అంతకంటే ఎక్కువ భాషలను పోల్చి చూచి తులనాత్మక పద్ధతులద్వారా భాషా జన్యజనక సంబంధాలను శాస్త్రీయంగా నిరూపించవచ్చు. కాబట్టి ప్రపంచభాషల వర్గీకరణ విధానాలతో ఈ వంశానుగుణ వర్గీకరణ(Geneological genetic or classification) సర్వోత్తమమయింది.

3.2. ప్రపంచ భాషల పదాంశానుగుణ వర్గీకరణ (Morphological or Typological Classification of world Languages)

భాషలో ముఖ్యమయినది పదాంశం (morpheme) పదాంశం అంటే అర్థవంతమయిన అవిభాజ్యమయిన భాషా కనిష్ఠోచ్చారణాంశం. ఇవి రెండురకాలు. 1. నిబద్ధ పదాంశం(Bound morpheme) 2. అనిబద్ధ పదాంశం (Free morpheme or unbound morpheme) 'కాయలు' అనే పదాన్ని తీసుకోండి. ఈ పదాన్ని 'కాయ లు' గా విభజించవచ్చు. 'కాయ' అనిబద్ధ పదాంశం. కాయను 'కఆయ్' అనే అక్షరాల సమాహారం. కాగా దీనిలో ఏ ఒక్క అక్షరాన్ని లోపింపచేసినా అర్థభంగమవుతుంది. 'కాయ' అవిభాజ్యం, అర్థవంతం. ఇది పదాంశం, 'కాయలు' లోని లు బహువచన ద్యోతక ప్రత్యయం. దీనికి ప్రత్యేక ప్రయోగార్హతలేదు. కాని ఏదైనా 'కాయ, తల' మొదలయినవాటికి చేరి బహువచనార్థాన్నిస్తుంది. కాబట్టి ఇది నిబద్ధపదాంశం. నిబద్ధపదాంశం పదాంశం(పదం) అవుతుంది, కాని అనిబద్ధపదాంశం పదం (word) కాదు. ఈ పదాంశ పరిజ్ఞానాన్ని బట్టి క్రీ.శ. 19వ శతాబ్దిలోని ఆగస్ట్‌వాన్ స్లెగెల్, ఏ.డబ్ల్యు. స్లెగెల్ (August Von Schelgul & A.W. Schelgul) సోదరులు, విశ్లేషాత్మక భాషలు(Analytic Languages) సంశ్లేషాత్మక భాషలు (Synthetic Language) అని ప్రపంచభాషలను విభజించగా ఈ విభజనను తిరస్కరించిన ఫ్రాంజ్ బాప్ ప్రభృతులు ప్రపంచభాషలను నాలుగు విధాలుగా విభజించారు.

1. విశ్లేషాత్మక భాషలు (Analytic or Isolating Languages)
2. సంయోగాత్మక భాషలు (Agglutinative Languages)
3. ప్రత్యయాత్మక భాషలు (Inflectioned Languages)
4. బహుధాసంశ్లేషాత్మక భాషలు (Poly-Synthetic or ir corporative Lan guages)

1. విశ్లేషాత్మక భాషలు (Analytic or Isolating Languages)

కారక ప్రత్యయాలుకాని, విభక్తి ప్రత్యయాలుకాని, క్రియాప్రత్యయాలు కాని, వ్యాకరణ కార్యాలు కాని లేకుండా ఈ భాషా వ్యవహర్తలు తమ భావప్రకటనను ఏవిధమైన వికారం పొందని ముడి శబ్దాల (మాటల)తోనే ప్రకటిస్తారు. భాషలోని పదాల స్థానాన్ని బట్టి అర్థబోధవీరికి కల్గుతుంది. చైనా, టిబెట్, బర్మా, మలయా 700 వరకు ఉన్న ఆఫ్రికాఖండ భాషలు ఈ వర్గానికి చెందినవే ఒకే పదం స్థానాన్ని బట్టి భిన్న స్వరంతో ఉచ్చరించబడటం విశేషం. ఉదా. చైనాభాషలో

'తా తోన్ - పెద్దమనుష్యుడు

లేన్ తా - మనుష్యుడు పెద్దవాడు

'తా, తో' పదాల స్థాన మార్పిడి వల్ల భిన్నార్థం కల్గింది.

మరో ఉదాహరణ

'న్లోతని' - నేను నిన్ను కొట్టుతున్నాను

'నితన్లో' - నీవు నన్నుకొట్టుతున్నావు

త = కొట్టటం, న్లో = నేను, ని= నిన్ను

ఈ ఉదాహరణల వల్ల పదాల మార్పిడి వల్ల వాక్యార్థం మారుతోంది. ఇది ఈ భాషలలోని విశేషం. భాష మొత్తమంతా ఈ విధంగా ఉండటం గమనార్హం. మిగిలిన భాషలలో అక్కడక్కడా ఇటువంటి మార్పుల వల్ల అర్థభేదమున్నా సర్వేసర్వత్ర ఉండదు.

2. సంయోగాత్మక భాషలు (Agglutinative Languages)

ఈ భాషలలో వేర్వేరు అర్థాలు కల శబ్దాలు గొలుసు కొక్కేలవలే ఒక దాని పక్క ఒకటి చేరి వేర్వేరర్థాల్నిస్తాయి. ఈ లక్షణం కలవే సంయోగాత్మకభాషలు, ప్రకృతికి చేరే ప్రత్యయాల్ని (Affixes) బట్టి ఈ వర్గంలోని భాషలను మూడు రకాలుగా విభజించారు.

(అ) పరానుబంధ సంయోగాత్మక భాషలు **(Suffix agglutinative Languages)**

తెలుగు వాక్యం : పెరుగు చున్నవి

పెర్ + ఉ - పెరు

పెరు + గు - పెరుగు

పెరుగు+ చు - పెరుగుచు

పెరుగు+ చు ఉన్న - పెరుగుచున్న

పెరుగు+ చున్న అది - పెరుగుచున్నది

టర్కిష్ : ఈ భాషలోని - లన్ తెలుగులో విలు వంటిది.

oda (ఒద) = గది

oda (ఒద) + lar (లర్) – ఒదలర్ = గదులు

ద్రావిడ భాషలు, యూరల్ – ఆల్టాయిక్, జపనీస్ భాషలు సంయోగాత్మక భాషలు.

(ఆ) పూర్వానుబంధ సంయోగాత్మక భాషలు (Prefix Agglutinative Languages)

ధాతువుకు పూర్వం ప్రత్యయాన్ని చేర్చటం బంటూ కుటుంబానికి చెందిన భాషలలో ఉంది. 'గండ' పదానికి 'ప్రజలు' అని అర్థం, 'లు-గండ' శబ్దానికి భాష అని అర్థం. 'గండ' శబ్దానికి పూర్వం'ఉ' చేరగా 'ఉగండ' అంటే దేశం అని అర్థం.

3. ప్రత్యయాత్మక భాషలు (Inflectional Languages)

పదాలు పనిచేసే విధానాన్ని ఈ భాషా వ్యాకరణం నియంత్రిస్తుంది (వ్యాకరణం ప్రతిమానవ మస్తిష్కంలోను సహజంగా ఉంటుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి.

ప్రత్యయం (affix) పూర్వప్రత్యయం (prefix) కావచ్చు,

అంతఃప్రత్యయం (infix) కావచ్చు,

అంతప్రత్యయం (suffix) కావచ్చు,

సంస్కృతం పూర్వప్రత్యయాత్మక భాష.

ఉదా.

"ఉపసర్గేణధాత్వర్థోబలాదన్యత్రనీయతే

ప్రహారాహారసంహార విహారపరిహార వత్"

'ప్ర, ఆ, సమ్, వి, పరి' అనేవి పై శ్లోకంలో ఉపసర్గలు, క్రియా యోగం కలవి. ఇవి పూర్వమే వస్తాయి. సం. ప్ర + హార – ప్రహార సం. ఆ + హార – ఆహార, సమ్ + హార – సంహార– సం. వి + హార – విహార, – సం. పరి + హార – పరిహార.

(అ) అంతరనుబంధ సంయోగాత్మక భాషలు (Infix agglutinative Languages)

అరబీ, సంతాలీ మొదలయిన భాషలలో ధాతువుల మధ్య ప్రత్యయాలు చేరతాయి. అరబీ 'క్‌త్‌బ్' ధాతువుకు 'లిఖించు' అని అర్థం. ఈ ధాతువు మధ్యలో 'ఈ, ఆ' ప్రత్యయాలు చేరి పుస్తకార్థంలో 'కితాబ్' పదమేర్పడింది. ఇదే ధాతువుకు మధ్యలో 'ఆ,ఇ' ప్రత్యయాలు చేరి లేఖకుడు అనే అర్థంలో కాతిబ్ పదమేర్పడింది.

సంతాలి భాషలో 'దల్' ధాతువుకు కొట్టు అని అర్థం. ఈ ధాతువు మధ్యలో 'ప' ప్రత్యయం చేర్చటం వల్ల కొట్టించు అనే అర్థంలో 'దపల్' పదమేర్పడింది.

4. బహుధా సంశ్లేషాత్మక భాషలు (Poly synthetic or Incorporative Languages)

వాక్యంలోని అనేక పదాలు ఒకేపదంగా కలిసి పోవటం బహుధా సంశ్లేషాత్మక భాషల లక్షణం.

ఉదా. ఎస్కిమోభాష

ఒనీదా onadia – నేను గ్రామంకోసం చూస్తున్నాను.

మాంటిజుమా Montezuma – నాయకుడు ఆగ్రహిస్తే స్వర్గానికి పోయేటట్లు కాలుస్తాడు.

పదాంశానుగుణ వర్గీకరణలోని ఈ నాలుగు రకాల విభజననే చాలా మంది సమ్మతిస్తున్నారు.

3.3.1. ప్రపంచ భాషల వంశానుగుణ వర్గీకరణ (Genealogical or genetic classification of world languages)

రెండు లేదా అంతకంటే ఎక్కువ భాషలను పరిశీలించి వాటిలో ఉన్న పదజాలాన్ని వ్యాకరణాంశాలను శాస్త్రీయంగా పోల్చిచూచి వాటి జన్యజనక భావ సంబంధాన్ని లేదా సోదర భావ సంబంధాన్ని లేదా వైరుధ్య సంబంధాన్ని నిర్ధారించవచ్చు. ప్రపంచంలో ప్రజల వ్యవహారంలో దాదాపు 6,500 భాషలు నిత్య వ్యవహారంలో ఉన్నాయి. శాస్త్రీయ పద్ధతులలో ఈ భాషలను పరిశీలించి ముఖ్యమయిన భాషా కుటుంబాలను ఈ కింది విధంగా విభజించారు.

1. ఇండో యూరోపియన్ భాషా కుటుంబం
2. సెమిటో హెమిటిక్ భాషా కుటుంబం
3. యూరల్ – ఆల్టాయిక్ భాషా కుటుంబం
4. బాస్క్ భాషా కుటుంబం
5. ఆస్ట్రో – ఏషియాటిక్ భాషా కుటుంబం
6. జపనీస్ భాషా కుటుంబం
7. సిమో–టిబెటన్ భాషా కుటుంబం
8. మలయో పోలినీసియన్ భాషా కుటుంబం

9. బంటూ భాషా కుటుంబం

10. ద్రావిడ భాషా కుటుంబం

3.3.2 ఇండో-యూరోపియన్ భాషాకుటుంబం

19వ శతాబ్దంలో సంస్కృతం, గ్రీకు, లాటిన్ మొదలయిన భాషలను తులనాత్మకంగా పరిశీలించిన భాషాశాస్త్రవేత్తలు ఆ భాషలలోని సారూప్యాన్ని గమనించి వాటి ఏక కుటుంబకతను స్థాపించారు.

సంస్కృతం	లాటిన్	గ్రీకు
ద్వి/ద్వా	దుఓ	దుఒ
దశ	దెసెమ్	దెక

ఈ పై పదాల పరిశీలనవల్ల సంస్కృతం, లాటిన్, గ్రీకులు ఒకే భాషా కుటుంబానికి చెందినట్లుగా గుర్తించవచ్చు.

ఇండో-ఆర్యన్ భాషాకుటుంబంగా ఈ భాషాకుటుంబాన్ని పూర్వం వ్యవహరించారు. కాని 'ఆర్య' శబ్దం దురుపయోగపరచబడ్డకారణంగా ఈ వాడుక వాడుక నుండి తొలగింది. ఈ భాషాకుటుంబాన్ని సునీత్‌కుమార్ చటర్జీగారు ఇండో-కెల్టిక్ భాషా కుటుంబంగా వ్యవహరించారు. ఈ పదాన్ని నేడు ఒప్పుకోవటం లేదు. హిందూ దేశంలోనూ, యూరప్ దేశంలోనూ ఈ భాషలు వ్యవహారంలో ఉండటం చేత ఈ భాషల్ని ఇండో-యూరోపియన్ భాషలు అని వ్యవహరిస్తున్నారు. ఈ పేరు సార్థకం. ఈ భాషా కుటుంబ శాఖల్ని పరిశీలిద్దాం.

(i) కెల్టిక్ (celtic) శాఖ: ఈ శాఖకు చెందిన గాలిష్ భాష (Gaulish language) గాల్ జాతివారు మాట్లాడేవారు. ఇది వ్యవహారభ్రష్టం.

(ii) వెల్ష్‌భాష (welsh language): ఈ భాష నేడు వేల్స్‌లో వ్యవహారంలో ఉంది.

(iii) బ్రెటన్ భాష (Breton language): బ్రెటాని (Bretons) లోవ్యవహారంలో ఉంది.

(iv) కార్నిష్ భాష (Cornish language): ఇది 18వ శతాబ్దిలో కనుమరుగయింది.

(v) ఐరిష్ భాష (Irish language): ఈ భాష నేడు ఐర్లండ్‌లో వ్యవహారంలో ఉంది.

(vi) మాంక్ భాష (Manx language): మాన్ (Man) దీవులలో పూర్వం వ్యవహారంలో ఉండేది.

లాటిన్ శాఖ (Latin branch)

ఇటాలియన్ భాష (Italian language)

ఇవి రోమన్ సామ్రాజ్యంలో వ్యవహరించబడే భాషలు కాబట్టి వీటికి రొమాన్స్ భాషలు (Romance languages) అనే పేరు కూడా ఉంది. ఇటాలియన్ భాష లాటిన్ మాండలికం. ఇటాలియన్ భాష అజంత పరిణామంకల భాష. ఈ శాఖలో ముఖ్యమయిన భాష లాటిన్ (Latin). దీని నుండే ఇటాలియన్, పోర్చుగీస్, స్పానిష్, ఫ్రెంచ్, రుమేనియన్ మొదలైన అనేక భాషలు ఆవిర్భవించాయి.

జెర్మానిక్ శాఖ (Germanic branch)

జెర్మానిక్ శాఖా వ్యవహర్తలు ప్రపంచ వ్యాప్తంగా ఉన్నారు. వీరు అమెరికా, కెనడా, యూరప్, ఆఫ్రికా, ఆస్ట్రేలియా, ఆసియాలో ఉన్నారు.

ఈ శాఖకు చెందిన వాటిలో ముఖ్యమైన కొన్ని భాషలు: జెర్మన్ భాష, డేనిష్ నార్వీజియన్ భాషలు, ఆంగ్లభాష (English language) ప్రపంచంలో వివిధ దేశాలలో వ్యవహారంలో ఉంది. ఆంగ్ల భాష విశ్వవిఖ్యాతమయింది. రవి అస్తమించని సామ్రాజ్యాన్ని ఆంగ్లేయులు 18, 19 శతాబ్దాలలో పరిపాలించారు. యు.ఎస్.ఏ.లో కూడా ఆంగ్లభాషే రాజ భాష. ఆంగ్ల భాష తెలిస్తే ప్రపంచమంతా తిరిగి రావచ్చు.

బాల్టో-స్లావిన్ భాషాకుటుంబం

ఈ భాషా కుటుంబంలోని బల్గేరియన్ భాష బల్గేరియాలో కోటి మందిచే వ్యవహరించబడుతోంది. జెక్ భాష జెకోస్లోవియాలో వ్యవహారంలో ఉంది. పోలిష్ భాష పోలండులో వ్యవహరంలో ఉంది.

రష్యన్ భాష రష్యా దేశంలో వ్యవహారంలో ఉంది. రష్యా అగ్రరాజ్యాలలో ఒకటి

గ్రీకు శాఖ (Greek language)

క్రీ.పూ. 2000 సంవత్సరాల నుండి ఈ భాష వ్యవహారంలో ఉంది. ప్రాచీన గ్రీకు శిలాశాసనాలు (క్రీ.పూ.1450-1200) లభ్యమవుతున్నాయి. ఈ భాషలో ఇలియడ్(Iliad), ఒడెస్సీ (Odyssey) గ్రంథాలను రచించిన హోమర్ సుప్రసిద్ధుడు. సోక్రటీస్, ప్లేటో, అరిస్టాటిల్ వంటి తాత్వికులు పైథాగరస్ వంటి గణిత శాస్త్రజ్ఞులు, అలెగ్జాండర్ వంటి యోధులు గ్రీకు భాషా వ్యవహర్తలు.

అల్బేనియన్ శాఖ (Albanian branch)

అల్బేనియన్ భాషలో గెగ్ (Geg), తొస్క్ (thosk) మాండలికాలున్నాయి.

ఆర్మీనియన్ భాష (Armenian language)

కాకస్ పర్వత ప్రాంతాలలో ఈ భాషా వ్యవహర్తలున్నారు.

ఇరేనియన్ శాఖ (Iranian branch)

ఈ శాఖకు చెందిన పారసీ భాష (Persian language) నేడు ఇరాన్ దేశంలో వ్యవహారంలో ఉంది. ఈ భాషలో అవెస్త (Avestan), ప్రాచీన పారశీకం (Old persian) అనే రెండు మాండలికాలున్నాయి. ఈ భాషా పదాలకు సంస్కృత పదాలకు ఎంతో సంబంధం ఉంది. వైదిక సంస్కృతానికి జెండ్ అవెస్తకు సన్నిహిత సంబంధముంది.

హిందార్య శాఖ (Indo-Aryan branch)

హిందార్య భాషలలో మొట్టమొదట పేర్కొతగ్గది 'ఛందస్' (వైదిక సంస్కృతం). వేదకాలాన్ని క్రీ.పూ. 1500 సంవత్సర ప్రాంతంగా ప్రొఫెసర్ సునీల్‌కుమార్ చటర్జీ ప్రభృతులు పేర్కొన్నారు. ప్రపంచంలో అత్యంత ప్రాచీన గ్రంథం ఋగ్వేదం. 10,552 మంత్రాలతో కూడిన ఈ శ్రుతి సాహిత్యపరంగా కూడా అతి ప్రాచీనమైంది, ఉత్తమమైంది. వేదాల తర్వాత బ్రాహ్మణులు, ఉపనిషత్తులు, అరణ్యకాలు, రామాయణ భారత భాగవతాది గ్రంథాలు అష్టాధ్యాయి, వ్యాకరణ, రఘుంశ కుమారసంభవాది గ్రంథాలు ప్రసిద్ధాలు. సంస్కృత భవాలైన ప్రాకృతాలు, నేటి ఉత్తరాది హిందీ, బెంగాలీ, మరాఠీ, గుజరాతీ, ఒడియ, అస్సామీ, కాశ్మీరీ, నేపాలీ, పంజాబీ భాషలు నేడు వ్యవహారంలో ఉన్నాయి. హిందీ రాజభాషగా పూర్తిస్థాయిలో ఉంది.

3.3.3. సెమిటో-హెమిటిక్ భాషా కుటుంబం

లిబియా, ఇరాక్, సిరియా, పాలస్తీనా ఇథియోపియా, అబిసేనియా, మడగాస్కర్ మొదలయిన చోట్ల ఈ భాషలు వ్యవహారంలో ఉన్నాయి. సెమిటిక్ శాఖలో హిబ్రూ, అరబీ భాషలు ముఖ్యమైనవి. హెమిటిక్ శాఖలో లిబికో, బెర్బల్, కోస్తిక్ భాషలు ప్రధానమైనవి.

3.3.4. యూరల్, ఆల్టాయిక్ భాషాకుటుంబం

ఈ భాషావ్యవహర్తలు టర్కీ, కొరియా, ఫిన్లండ్, హంగరీ మొదలయిన దేశాలలో ఉన్నారు. చైనా రష్యా సరిహద్దు ప్రాంతాలలో ఈ భాషా వ్యవహర్తలు నివసిస్తున్నారు. చైనా రష్యాలలో వీరు ఉన్నారు. అమెరికాలో కూడా వీరున్నారు. కొందరు ఈ భాషలనే ఫిమ్నో-ఉగ్రియన్ భాషలని వ్యవహరిస్తారు. యూరల్, ఆల్టై పర్వత ప్రాంతాలలో

నివసించే వారు మాట్లాడే భాషలు కాబట్టి యూరల్-ఆల్టాయిక్ భాషలు అని టర్కిష్, ఫిన్నిష్, మంచూ భాషలను పేర్కొంటున్నారు. వీటికి ద్రావిడ భాషలకు కొన్ని పోలికలున్నాయి. యూరల్-ఆల్టాయిక్ భాషలు అని టర్కిష్, ఫిన్నిష్, మంచూ భాషలను పేర్కొంటున్నారు. వీటికీ ద్రావిడ భాషలకు కొన్ని పోలికలున్నాయి. యూరల్-ఆల్టాయిక్, ద్రావిడ భాషాకుటుంబాలు రెండూ సంయోగాత్మక భాషలు. కాబట్టి ఈ పోలికలు టర్కిష్ భాషల్లో -లర్ బహువచన ప్రత్యయం.

టర్కిష్	'ఎమో'	ఇల్లు	'ఎమోలర్'	ఇళ్ళు
టర్కిష్	'ఒద'	గది	'ఒద-లర్'	గదులు
తెలుగు	'తల'	శిరస్సు	'తల-లు'	శిరస్సులు

ఈ పోలికలకు కారణం రెండూ సంయోగాత్మక భాషలు కావటమే. శబ్దాలలో ఈ రెండు భాషలకు పోలిక లేదు.

3.3.5. బాస్క్ భాషాకుటుంబం

ఫ్రాన్స్, స్పైన్ దేశాలలోని కొన్ని ప్రాంతాలలో ఈ బాస్కు భాషలను కొందరు మాట్లాడుతున్నారు. వీరి భాషలు మరే ఇతర భాషాకుటుంబ భాషలతోను పోలి ఉండక పోవటం చేత బాస్కు భాషలను వేరే భాషాకుటుంబానికి చెందినవిగా భాషాశాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

3.3.6. ఆస్ట్రో-ఏసియాటిక్ భాషాకుటుంబం

ఈ భాషలు ఆగ్నేయ ఆసియా అంతటా వ్యాపించి ఉన్నాయి. ముండా శాఖలోని సవర, సంతాలీ, ఖడియా, ఖాసీ భాషలు ఒడిస్సా, మధ్య ప్రదేశ్, అస్సాం రాష్ట్రాలలో వ్యవహారంలో ఉన్నాయి. నికోబార్ దీవులలోని నికోబరీస్ ఈ శాఖకు చెందినదే. ఈ భాషల ప్రభావం సంస్కృతంపై ఉన్నట్లు అలాబు, లాజ్గల, కదళీ, నారికేళ, తాంబూల పదాల పరిశీలన వల్ల మనకు తెలుస్తుంది.

3.3.7. జపనీస్ భాషాకుటుంబం

జపాన్, కొరియా దేశాలలో ఈ భాష వ్యవహారంలో ఉంది. ఇంతేకాక, ఫార్మోజా, కెరోలిన్, మార్షల్ దీవులు, చైనాలో అనేక భాగాలలోను ఈ జపనీస్ భాష వ్యవహారంలో ఉంది. ఇది సంయోగాత్మక భాష. లింగవచన భేదం లేని భాష.

3.3.8. సిమో-టిబెటన్ భాషాకుటుంబం

ఆసియాలో అన్నిటికంటే పెద్ద భాషాకుటుంబం. ఇందులో చైనీస్, టిబెటోబర్మన్

భాషలు ముఖ్యమైనవి. ఉత్తర చైనా అంతటా వ్యాపించి ఉన్న మండారిన్ భాష చాలా ముఖ్యమైన భాష, జనసంఖ్య చాలా ఎక్కువ. ఒకే ప్రాంతంలో ఇంతమంది మాట్లాడే భాష ప్రపంచంలో మరేదీ లేదు. టిబెట్‌లో టిబెటన్ భాష మాట్లాడతారు. బర్మాలో బర్మీస్ మాట్లాడతారు. మన దేశంలో మాట్లాడే బోడో, నాగా, కుకి-చిన్ భాషలు ఈ సిమో-టిబెటన్ భాషాకుటుంబానికి చెందినవే.

3.3.9. మలయో - పోలినీసియన్ భాషాకుటుంబం

ఇండో-యూరోపియన్ భాషాకుటుంబం తర్వాత మలయో-పోలినేషియన్ భాషా కుటుంబం ప్రపంచ వ్యాప్తంగా ఉంది. ఇందులో పసిఫిక్ ద్వీపాలు, పశ్చిమాన మడగాస్కర్ దాకా ఈ వ్యాప్తి ఉంది. ఇందులో పశ్చిమ శాఖ, తూర్పుశాఖ అని రెండు శాఖలున్నాయి. పశ్చిమ శాఖలో 'మలే' (సుమిత్రా, మలయా, బోర్నియా), ఇండోనేషియా, జపనీస్, మండానీస్, బతక్, తగలాగ్ మొదలైనవి. తూర్పు శాఖలో పోలినీసియన్, మెలనీసియన్, మైక్రోనీసియన్‌లు సుప్రసిద్ధమైనవి.

3.3.10. బంటూ భాషాకుటుంబం

బంటూ భాషాకుటుంబ భాషావ్యవహర్తలు దక్షిణాఫ్రికా దేశంలో ఎక్కువమంది ఉన్నారు. ఈ భాషలలో లింగవచనాలను సూచించటానికి పూర్వానుబంధాలు (prefix) ఉన్నాయి.

ఉ-గండా-భాష మాట్లాడేవారు

బ-గండా - ఉగండాలోని జాతివారు.

దక్షిణాఫ్రికా ఎడారిలో బుష్మన్, హాటెన్‌టా భాషలు నశించాయి. ఇవికూడా బంటూ భాషాకుటుంబానికి చెందినవే. ఇది ప్రత్యయాత్మక భాష. ఈ భాషలో పదానికి ముందు ప్రత్యయాలు చేరి సంస్కృతంలోని ఉపసర్గలవలె అర్థాన్ని మారుస్తాయి.

3.3.11. ద్రావిడ భాషాకుటుంబం

ఇప్పుడు వ్యవహారంలో ఉన్న 26 ద్రావిడ భాషలను పరిశీలించిన తర్వాత క్రీ.పూ. 4,000 సంవత్సరాలకు పూర్వం లేదా ఆ సమయంలో ఇప్పటి ద్రావిడ భాషలన్నిటికీ మూలమైన మూలద్రావిడ భాష వ్యవహరించబడేదని భాషాశాస్త్రవేత్తలు భావించారు. మూల ద్రావిడ భాషావ్యవహర్తలు కాలక్రమేణ అఖండ భారతదేశంలోని దిగువ భాగాలకు, ఉత్తర, మధ్య, దక్షిణ ప్రాంతాలకు చేరి ఉంటారని హేతుబద్ధంగా భావించబడింది. ఈ విధంగా మూల ద్రావిడ భాష ప్రధానంగా మూడు భాగాలుగా విడిపోయింది. ఈ మూడు మూల ఉపద్రావిడ భాషలు దాదాపు పునర్నిర్మితాలయ్యాయి.

ఆ మూల ఉప ద్రావిడ భాషా కుటుంబాలను, వాటిలో వ్యవహారంలో ఉన్న ద్రావిడ భాషలను గమనించండి.

అ) మూల ఉత్తర ద్రావిడ భాషలోని ద్రావిడ భాషలు - 3

1. బ్రాహుయీ (ఇప్పుడు పాకిస్తాన్‌లోని బెలూచిస్తాన్‌లో వ్యవహారంలో ఉంది, 2. కూడుఖ్, 3. మాల్తో.

ఆ) మూల మధ్య ద్రావిడ భాషకు చెందిన భాషలు - 12

1. తెలుగు (సాహిత్య వంతమయిన భాష), 2. గోండీ, 3. పెంగో, 4. మండ, 5. కొండ/కూడి, 6. కూయి, 7. కువి, 8. కోలామి, 9. నాయకీ, 10. పర్జీ, 11. గదబ, 12. ఒల్లారి.

ఇ) మూల దక్షిణ ద్రావిడ భాషకు చెందిన భాషలు - 11

1. తమిళం (సాహిత్య వంతమయిన భాష), 2. కన్నడం (సాహిత్య వంతమయిన భాష), 3. మలయాళం (సాహిత్య వంతమయిన భాష), 4. తుళు (సాహిత్య వంతమయిన భాష), 5. కొడగు, 6. కోత, 7. తొద, 8. బడగ, 9. కొరగ, 10. ఇరుళ, 11. కుఱుంబ.

పలువురు పేర్కొన్న అమెరికన్ ఇండియన్ భాషాకుటుంబం గురించి పెద్దగా తెలియదు.

4.1. ధ్వని (phone) - వర్ణం (phoneme) - సవర్ణం (allophone)

ప్రాణులు సహజమయిన కోరికలను (వాంఛలను) వ్యక్తం చేయటానికి పుట్టటంతోనే ఏవో కొన్ని ధ్వనులను చేస్తుంటాయి. మొదట్లో ఈ ధ్వనులు ఆహారానికి సంబంధించినవై ఉంటాయి. జీవుల ధ్వనులు లెక్కకు మించి ఉంటాయి. ఈ ధ్వనులను మనం రెండు రకాలుగా విభజించవచ్చు. 1. మానవేతర జీవుల ధ్వనులు, 2. మానవ ధ్వనులు.

ఈ రెండింటికి కల భేదాన్ని మనం స్పష్టంగా తెలుసుకోవాలి. మానవేతర జీవులు తాముచేసే ధ్వనులతో తమ మనోభావాలను సమగ్రంగా వ్యక్తీకరించలేవు. గిబ్బన్లు (Gibbons) మాత్రం భయాది భావాల్ని వ్యక్తీకరించటానికి తోటి గిబ్బన్లకు సమాచారాన్ని ధ్వనులతో తెలుపుతాయి. కాని ఈ ధ్వనులు ఏ జీవిలోను 15కు మించి లేవు. కాబట్టి ఇవి భాషాధ్వనులు కావు. వీటిని కేవలం ధ్వనులు (sounds) అని పిలవవచ్చు. మనిషి కూడా అనేక ధ్వనులను చేస్తుంటాడు. మనిషిచేసే అరుపుల వల్ల, కేకలవల్ల, ఛీత్కారాదుల వల్ల వెలువడే ధ్వనులు కూడా మనం భావించే ధ్వనులు కావు. మనిషి కూడా హోమో-సెపియన్ (Homo-sapien) నుండి వచ్చిన పరిణత

జీవి అనే విషయాన్ని మనం ఏ క్షణంలోనూ విస్మరించకూడదు. మనిషి లోకాన్ని జంతు లక్షణాలుంటాయి, ఉన్నాయి. అలాంటి ఆవేశ, కోపాదులవల్ల వచ్చే ఈ ధ్వనులు, ఈ భాషా విశేష ధ్వని స్వరూపాన్ని జగత్తులో ఆవిష్కరించిన వాడు మహేశ్వరుడు కాగా గ్రహించిన వారు సనకసనంద, సనత్కుమార, సనత్సు, జాత, పాణిన్యాది సిద్ధ పురుషులు. ఈ విషయం నందికేశ్వర కారిక వల్ల మనకు స్పష్టమవుతుంది.

4.2. ధ్వని (phone)

"నృత్తావసానే నటరాజరాజో, ననాద ఢక్కాంనవపఞ్చ, వారమ్।
ఉద్ధర్తు కామః సనకాది సిద్ధా, నేతవిమర్శే శివసూత్రజాలమ్॥

(నృత్తం ముగింపులో నటరాజ రాజు (పరమేశ్వరుడు 14 పర్యాయాలు ఢక్కను మోగించాడు. దీని విమర్శలో శివసూత్ర సమూహమైంది). ఈ శివఢక్కా చతుర్దశ నినాదాలు పాణిని మహర్షికి శ్రవణ గోచరమైంది. ఈ విషయం పండిత మండలిచే ప్రకటితం.

"మేనాక్షరసమామ్నాయమధిగమ్య మహేశ్వరాత్
కృత్స్నం వ్యాకరణం ప్రోక్తం తస్మై పాణినమేనమః"

(పశుపతి నుండి అక్షర సముదాయాన్ని పొంది మొత్తం వ్యాకరణం ఎవనిచే చెప్పబడిందో ఆ పాణిని మహర్షికి నమస్కారం). మహేశ్వరఢక్కానాదంవల్ల పాణిని కర్ణ పుటలకు 14 ధ్వనులు విన్పించాయి. ఆ 14 ధ్వనులను 14 సూత్రాలుగా పాణిని మహర్షికి తోచాయి. ఆ పధ్నాలుగు సూత్రాలు:

1. అ ఇ ఉ ణ్
2. ఋ ఌ క్
3. ఏ ఓ ఙ్
4. ఐ ఔ చ్
5. హయవరట్
6. లణ్
7. ఞమఙణనమ్
8. ఝ భ ఞ
9. ఘ ఢ ధ ష్
10. జ బ గ డ ద శ్
11. ఖ ఫ ఛ ఠ థ చ ట త వ్
12. క ప య్

13. శ ష స ర్

14. హ ల్

మానవుడుచ్చరించే భాషకు సంబంధించిన శబ్దాన్ని ధ్వని (phone) అని ధ్వని నిర్వచనం. మానవుడుచ్చరించే భాషకు సంబంధించని చప్పుడును శబ్దం (sound) అని మనం శబ్దాన్ని నిర్వచించవచ్చు. ధ్వనులను వివరించే శాస్త్రం ధ్వనిశాస్త్రం (phonetics) భాషకు సంబంధంలేని శబ్దాలతో ఈ భాషాశాస్త్రం సంబంధం పెట్టుకోదు. ధ్వనులు భాషా నిర్మాణంలో ఏ విధంగా ప్రవర్తిస్తాయో తెలిపే శాస్త్రం ధ్వని ప్రవర్తనా శాస్త్రం(phonology)

4.3. వర్ణం (phoneme)

అర్థభేదన సమర్థమయిన భాషా కనిష్ఠాంశం వర్ణం (phoneme) అర్థభేదన సమర్థాలు కానివి ప్రత్యేకవర్ణాలు కావు. ఉదా. కారం-ఖారం, కరువు-ఖరువు, కర్మ-ఖర్మ, మొకం-మొఖం. ఈ పదాలలోని ఖ మొ॥న మహాప్రాణతకు అర్థభేదన సమర్థత లేదు. కాబట్టి ఈ పదాలలోని 'ఖ' ప్రత్యేక వర్ణంకాదు. కాని సంస్కృత భాషలోని 'క,ఖ'లకు అర్థ భేదన సామర్థ్యముంది. ఉదా. సం. కర- శబ్దానికి హస్తం అర్థంకాగా సం.ఖర- శబ్దానికి గాడిద అని అర్థం. సంస్కృత భాషలో 'క,ఖ'లు ప్రత్యేక వర్ణాలు. అర్థ భేదకతను నిర్ణయించటానికి కనిష్ఠ భేదకయుగ్మాన్ని తీసుకోవాలి. కనిష్ఠ భేదకయుగ్మంవల్ల మనకు భేదకత్వం (అర్థభేదనసామర్థ్యం) తెలుస్తుంది. ఒకేస్థానం లో సన్నిహితాలైన వేర్వేరు ధ్వనులుండటథవల్ల జంట పదాలకు అర్థంలో తేడా స్పష్టమైతే ఆ జంట మాటలను కనిష్ఠ భేదక యుగ్మం (minimal pair) అంటారు. ఈ యుగ్మభేదాన్ని భేదకత్వం (contrast) అని నిర్వచించారు. ఈ అర్థభేదక నిర్ణయ విషయాన్ని ప్రాచీన భారతీయ వైయాకరణులు క్రీస్తు పూర్వమే గుర్తించి సోదాహరణంగా వివరించారు.

"యద్యపి బహునాధీషే
తథాపి పఠవ్యాకరణమ్
స్వజనః శ్వజనోమాభూత్
సకలం శకలం సకృత్ శకృత్" ఈ శ్లోకంలోని
స్వజనః - శ్వజనః
సకలమ్ - శకలమ్
సకృత్-శకృత్

సంస్కృత వైయాకరణులు అర్థభేదాన్ని సూచించటానికి మూడు భాషా కనిష్ఠయుగ్మాల్నిచ్చారు.

వీటి అర్థభేదాన్ని తెలుసుకుందాం.

సంస్కృతం	అర్థం	సంస్కృతం	అర్థం
స్వజనః	తన జనులు	శ్వజనః	కుక్కలు (కుక్కల సమూహం)
సకలమ్	సమస్తం	శకలమ్	మున్క (ఖండం)
సకృత్	ఒక పర్యాయం	శకృత్	మలం (విష్ఠ)

ఈ ఉదాహరణలవల్ల సంస్కృత భాషలో 'శ,స'లు ప్రత్యేక వర్ణాలని స్పష్టమౌతుంది. వర్ణస్థాపక విధానాలలో ఇది ప్రధానమయ్యింది. ఈ విధానంవల్ల ఆయా భాషల్లోని వర్ణాలను నిర్దిష్టంగా నిర్ధారించవచ్చు.

ఈ పద్ధతిననుసరించి తెలుగులోని అచ్చులకు హల్లులను ఏ విధంగా స్పష్టంగా నిర్ధారించవచ్చో గమనించండి

తెలుగు వర్ణం	కనిష్ఠ భేదకయుగ్మం
అ–ఆ	అను–ఆను
।అ। ।ఆ।	పడు – పాడు
	పలు – పాలు
ఇ–ఈ	ఇవి – ఈవి
।ఇ। ।ఈ।	ఇల – ఈల
ఉ–ఊ	ఉడుపు – ఊడుపు
।ఉ। ।ఊ।	ఉరిగోల – ఊరిగోల
	పుట – పూట
ఎ – ఏ	తెగ – తేగ
।ఎ। ।ఏ।	నెల – నేల
	మెడ – మేడ
ఒ–ఓ	దొర – దోర
	కొన – కోన
।ఒ। ।ఓ।	ఒక – ఓక
క – గ	కల – గల

	కట్టు - గట్టు
	కంప - గంప
చ - జ	చల్లు - జల్లు
।చ। ।జ।	చక్కి (చోటు) జక్కి (తిరగలి)
	చట్టు (రాయి) జట్టు
ట - డ	ఆట - ఆడ
।ట। ।డ।	పాటు - పాడు
	కాటు - కాడు
డ - ణ	కడుపు - కణుపు
। ణ ।	పాడి - పాణి (చెయ్యి)
	వాడి - వాణి
త - ద	తన్ను - దన్ను
।త। ।ద।	తడి - దడి
	తాడి - దాడి
త - న	కతలు - కనలు (కోపం)
	గతి - గని
।న।	పతి - పని
ప-బ	పక్క - బక్క
।ప। ।బ।	పలుపు - బలుపు
	పొట్టు - బొట్టు
।మ।	పుట్టు - ముట్టు
	పట్టు - మట్టు
	పాపు (వెడలగొట్టు) - పాము
।య।	తెలుగు పదాలలో పదాది యకారం లేదు. అపదాది తెలుగులో యకారం తర్వాతి కాలంలో ఏర్పడింది. కాయ, పాయ మొదలయిన నామ వాచకాలలోను చేయు, నేయు మొదలైన ధాతువులలోను ఇది కన్పిస్తోంది.
ర - అ	నేరు - వేఱు
	నీరు - నీఱు (నివుఱు)

।ర। ।ఱ।	పారుడు – పాఱుడు (విప్రుడు)
	కారు – కాఱు (స్రవించు)
ల–ళ	కల – కళ
వ	వాలు – బాలు
।వ।	వాన – బాన

తెలుగు భాషలోని హవర్ణయుక్తపదాలు కన్నడ భాషనుండి ప్రతిదేయ పదాలుగా వచ్చినవే. 'శ, స' లు ప్రత్యేక పదాలుగా పూర్వమే విశదీకరించబడ్డాయి. ద్రావిడ భాషలలో ఊష్మవర్ణాలు ఆదిలో లేవని గ్రహించాలి. ఇతర భాషలనుండి ఎరువు పదాల ద్వారా స్వభాషలో ప్రవేశించి హ, ఖ, ఫ, ఛ, ఠ, థ, శ, ష, జ, ఞ, ఃతోడి పదాలు, హ ఫ (f)లు ప్రత్యేక ధ్వనులుగా తప్పక గుర్తించాలి. ఫోను(phone) /బోను।ఫ।(f) / ।బ। కనిష్ఠ భాషా భేదక యుగ్మం (minimal pair).

4.4. సవర్ణం (allophone)

ఒక వర్ణానికి మాత్రమే చెందిన వర్ణాలు సవర్ణాలు (allophones) అని వ్యవహరిస్తారు. సవర్ణాల మధ్య భేదకత్వం (contrast) లేదు కాబట్టి ఇవి వేర్వేరు పరిసరాలలో (different environments) ఉంటాయి.

తెలుగులోని సవర్ణాలు (allophones in Telugu)

తెలుగులోని తాలవ్య చకారానికి దంత్య చ కారానికి, తాలవ్య జకారానికి దంత్య జ కారానికి భేదకత్వం (contrast) లేదు. కాబట్టి ఇవి సవర్ణాలు. ఇవి పరిపూరక ప్రవృత్తి (complimentary distribution) లో ఉంటాయి. ఒక సవర్ణం ఒక ప్రత్యేక స్థానంలోనూ, మరో సవర్ణం మరో స్థానంలోనూ ఉండటాన్ని పరిపూరక ప్రవృత్తి అంటారు.

సవర్ణ సంజ్ఞనుపయోగించి సూత్ర సహితంగా సోదాహరణంగా వివరించిన వ్యాకరణ పండితుడు శ్రీ పరవస్తు చిన్నయసూరి. ఈయన బాలవ్యాకరణంలో "దంత్య తాలవ్యంబులయిన చజలు సవర్ణంబులు" (బాలవ్యా. సంజ్ఞా. 7) సూత్రించి తాలవ్యచకారంబు దంత్య చకారంబునకును తాలవ్య జ కారంబు దంత్య జకారంబునకును గ్రాహకములని తాత్పర్యము" అని వివరించి తాలవ్య దంత్య చజల వేర్వేరు (different environments) వాటినిచ్చారు. "ఇ ఈ ఎ ఏలంగూడిన చజలు తాలవ్యంబులు, అఆ ఉఊ ఒఓ ఔ లంగూడిన చజలూ దంత్యంబులు" (బాలవ్యా. సంజ్ఞా. 8, 9). "చిలుక, చీమ, చెలి, చేమ జిల, జీడి, జెట్టి, జేజి"లలో తాలవ్య చ,

జ లుండగా, " చేలి, చేప, చెక్క, చేపు, చొక్కు, చోటు, చౌక, జెముడు, జొతర, జున్ను, జూలు, జొన్న, జోలి, జోకు"లలో దంత్య చే జే లున్నాయని సూరిగారు ఉదహరించారు. దంత్య తాలవ్య చ జ లకు వర్ణ పరిసరాలు స్పష్టంగా ఉన్నాయి. దంత్య పరిసరాల్లోకి తాలవ్య చ జ లు లేవు.తాలవ్య పరిసరాల్లోకి దంత్య చ జ లు రాలేవు.కాబట్టి ఇవి సవర్ణాలు వీటిని ఈ విధంగా సూచించవచ్చు:

చ వర్ణానికి (చ) (చ) లు రెండూ సవర్ణాలు.

జ వర్ణానికి (జ) (జ) లు రెండూ సవర్ణాలు.

అసంయుక్త రేఫం అల్పప్రాణ దంత మూలీయ నాద తాడితం (unaspirated alveolar voiced flap)గాను, ద్విత్వరేఫ అల్పప్రాణ దంతమూలీయనాద కంపిత ధ్వనిగాను రేఫ భిన్న పరిసరాల్లో భిన్నరీతులలో ఉచ్చరించబడుతోంది.

ఉదా: పేరు, ఊరు, పోరు మొదలయిన చోట్ల రేఫ అల్పప్రాణ దంతమూలీయ నాదతాడిత ధ్వనిగాను, మట్టి, కట్టి, జెట్టి మొదలయిన చోట్ల ద్విత్వ రేఫ అల్ప దంతమూలీయ నాద కంపిత ధ్వనిగాను విన్పిస్తోంది. కాబట్టి ర, ఱలు రెండూ ర కు సవర్ణాలు. తెలుగులో 'గ' వర్ణం అల్పప్రాణ నాద కంఠ్యస్పర్శంకాగా, రెండచ్చుల మధ్య అసంయుక్తంగా ఉన్న 'గ' వర్ణం నాదకంఠ్యోష్మంగా ఉచ్చరించబడుతోంది.

ఉదా:	నాద కంఠ్యోష్మస్పర్శం	నాదకంఠోష్మం
	గాలి	పగలు
	గుఱ్ఱం	చిగురులు
	గునపం	పగులు

గ - (గ) (గ)

5.1 పదం (word) - పదాంశం (morpheme) (అర్థకం)

సపదాంశం - (allomorph) (సార్థకం)

భాషలో అన్నిటికంటే ముఖ్యమైనది వాక్యం. కొన్ని సందర్భాల్లో ఒక పదం ఒక వాక్యం కావచ్చు. ఉదా: నీవు ఎప్పుడు వచ్చావు? అనే ప్రశ్నకు 'నిన్న' అనే ఒక మాటతో ఒకడు జవాబు చెబితే అది వాక్యమవుతుంది. ఇక్కడ 'నిన్న' అనే మాటకు 'నేను నిన్న వచ్చాను' అనేది అర్థం. కాబట్టి వాక్యం పదం కావచ్చు, పద సముదాయం కావచ్చు. 'భాషకు వాక్యం ప్రమాణం" (sentence is the unit of language) అనే వాక్యం సత్యం. ఈ వాక్యార్థాన్ని వాక్యంలోని పదాల ద్వారా లేదా పదాంశాది భాగాల ద్వారా తెలుసుకోవటానికే వ్యాకరణ వేత్తలు లేదా భాషా శాస్త్రజ్ఞులు కృషి చేశారు. భర్తృహరి వాక్య పదీయంలో ఈ విషయాలు చర్చించబడాయి.

"word is minimum free form" (Language p.178) (భాషలో కనిష్ఠ స్వతంత్ర రూపం పదం) అనేది ఎల్.బ్లూమ్‌ఫీల్డ్ నిర్వచనం. "సుప్తి జన్తమ్పదమ్" (అష్టా. 1-4-14) అని పాణిని మహర్షి పద నిర్వచనం. సుబన్తంతిజన్తం చపదసంజ్ఞంస్యాత్ (సుబంతానికి తిజంతానికి పదసంజ్ఞ) అని సిద్ధాంతకౌముదీ కారవృత్తి. ఈ పద నిర్వచనం సంస్కృత భాషకు నప్పుతుంది కాని ప్రపంచంలోని అనేక భాషలకు సరిపోవటం లేదు. ప్రపంచ భాషలన్నిటికి సరిపోయే పదనిర్వచనం ఇప్పటి వరకు రాలేదు. పదాన్ని కూడా ఇంకా చిన్న చిన్న ముక్కలుగా విభజించి చూడటానికి అవకాశముందా అనే విషయాన్ని పరిశీలిద్దాం.

'ఆవు, ఇల్లు, చెట్టు' మొదలైన పదాలు స్వతంత్ర పదాలు – వీటిని free forms అని బ్లూమ్ ఫీల్డ్ పేర్కొన్నారు. 'ఆవు' పదాన్ని విభజిస్తే అర్థభంగం కల్గి పదత్వ సిద్ధి కలగదు. ఆ ఇల్లులో ఉన్న 'ఆ' కు 'ఆవు' లో ఉన్న ఆవుకు తేడా ఉంది. 'ఆ ఇల్లు' లో ఉన్న 'ఆ' పదం కాగా 'ఆవు'లో 'ఆ' స్వతంత్ర రూపంకాదు. 'కాయలు' అనే పదాన్ని తీసుకోండి. దీన్ని 'కాయ+లు' అని విభజించవచ్చు. దీనిలోని '-లు' బహువచన ప్రత్యయం. దీనికి బహుత్వాన్ని బోధించే శక్తి ఉంది. 'కాయ' అనే పదాంశానికి (ఇకమీదట పదంకు మారుగా పదాంశం వాడబడుతుంది). '-లు' అనే పదాంశం చేర్చబడుతుంది. 'కాయలు' లో 'కాయ' కు స్వతంత్ర రూపం ఉండి స్వతంత్ర ప్రయోగార్హత ఉండగా '-లు' కు స్వతంత్ర ప్రయోగార్హత లేదు. 'కాయలు'లోని 'కాయ' స్వతంత్ర ప్రయోగర్హమయినది కాబట్టి అనిబద్ధ పదాంశం (free morph free form) స్వతంత్ర ప్రయోగార్హత లేనిది కాబట్టి అస్వతంత్ర పదాంశం(bound morph form)అనే భాషా శాస్త్రజ్ఞులు వ్యవహరిస్తారు. ఎల్. బ్లూమ్‌ఫీల్డ్ గారి ఈ కింది వాక్యాన్ని పరిశీలించండి: "A linguistic form which is never spoken alone is a bound form. All others are free forms" (language p.160) స్వతంత్రంగా ఉచ్చరించబడని భాషా పదాంశం నిబద్ధ పదాంశమనీ, తక్కినది అనిబద్ధ పదాంశమనీ ఈ వ్యాక్యార్థం. అనిబద్ధ పదాంశాలను అర్థాలను నిఘంటువుల ద్వారాను, నిబద్ధ పదాంశాల అర్థాలను వాటి విశేషాలను వ్యాకరణాల ద్వారాను తెలుసుకోవచ్చు. పదాంశ (అర్థక) నిర్వచనం ఈ కింది వాక్యంలో బాగా ఇవ్వబడింది:

"Any form whether free or bound, which connot be divided into smaller meaningful parts is a Morpheme" (An outline of linguistic analysis p.54)

అర్థవంతమయిన కనిష్ఠ భాగాలుగా విభజించటానికి వీలుకాని స్వతంత్రం (అనిబద్ధ) లేదా నిబద్ధ శబ్ద రూపం పదాంశం (అర్థకం) అని భాషాశాస్త్రజ్ఞుల పదాంశ (అర్థక) నిర్వచనం. ఈ పదాంశాల (అర్థకాల) అంతర్నిర్మాణాన్ని అధ్యయనంచేసే దానిని పదాంశ విజ్ఞానం (Morphology) అని వ్యవహరిస్తారు.

5.2 సమ ధ్వనులు (Homophones)

ఒకే శబ్ద రూపం కలిగి ఒకే ఉచ్చారణ కలిగి భిన్నార్థాలున్న భిన్నపదాలను సమ ధ్వనులనవచ్చు

పదం	అర్థం
వేరు	చెట్టు వేరు
వేరు^{2}(వేలు)	భిన్నం

'వేరు', వేరు^{2}" లు సమ ధ్వనులు (homophones)

ఆంగ్లంలోని 'meet , meat' లు రెండూ రెండు పదాలు. కాని వీటి ఉచ్చారణ ఒకటే. ఇవి సమధ్వనులు (Homophones). వీటికి కోశాలలో వేర్వేరు ఆరోపాలు (entries) ఇవ్వాలి. ఆంగ్ల భాషలోని (bear) ఎలుగుబంటి? (bear) ప్రసవించు రెంటి ఉచ్చారణ ఒకటే. ఒకటి నామవాచకమైన భలూకార్థాన్నిస్తుండగా ఒకటి ప్రసవించి అనే క్రియార్థాన్నిస్తోంది. కాబట్టి వీటికి కోశాలలో రెండు ఆరోపాలు (entries) ఇవ్వాలి.

(bear) భల్లూకం (bear^{2}) ప్రసవించు

(meet) కలుసుకొను (meat) మాంసం

5.3. సమస్వరత (Vowel hormony)

ఏ.వ.	బ.వ.
కాకి	కాకులు (< కాకి+లు)
కత్తి	కత్తులు (< కత్తి+లు)

తెలుగులో బ.వ. '–లు' వర్ణం పరమైనప్పుడు కాకి, కత్తి మొదలైన పదాలలోని ఇత్వం ఉత్వంగా మారుతుంది.

"ఇత్తునకు బహువచనంబు పరంబుగునప్పు డుత్వంబగు"

(బాలవ్యా. తత్సమ45)

అని ఈ మార్పును సూరిగారు స్రూతీకరించారు. ఈ మార్పుకు కారణం బ.వ. '-లు' లోని ఉత్త్వమే. దీనిని భాషాశాస్త్రజ్ఞులు సమస్వరత (Vowel hormony) అని వ్యవహరిస్తారు.

5.4 సామ్యం (Analogy)

ఒక శబ్దరూపాన్ని గమనించి దాని సామ్యంవల్ల మరోశబ్దరూపాన్ని కల్పించటాన్ని సామ్యమని నిర్వచించవచ్చు. సంస్కృత భాషలో తృతీయా బహువచన రూప ప్రత్యయం "- భిస్(భిః)"

ఉదా : లతా-భిః తేన-తైః అనే సర్వనామ శబ్ద రూపాల సామ్యంవల్ల సంస్కృత భాషలో 'రామైః' అనే బ.వ. రూపమేర్పడింది.

5.5 ప్రత్యేక పదాంశాలు (Special morphemes)

ఆంగ్లంలో బహువచన ప్రత్యయం, ' -s' అనిబద్ధ పదాంశానికి చేర్చుతారు.

ఉదా: book (singular) అనిబద్ధ పదాంశానికి బ.వ. ప్రత్యయం 's' ను చేర్చగా 'books' ఏర్పడింది. కాని, 'ox' అనిబద్ధ పదాంశానికి బ.వ.లో '-en' ప్రత్యయమూ, 'Child' అనిబద్ధ పదానికి '-ren' బ.వ.లో చేరి క్రమంగా 'ox-en: 'Child-ren' పదాంశా లేర్పడ్డాయి. వీటిని (-en, -ren లను) ప్రత్యేక పదాంశాలుగా గుర్తించారు.

5.6 ఆదేశపదాంశం (Reflexive morpheme)

ఆధార (base) భూతమయిన ఒక పదం ఇంకో పదం భిన్నార్థక (బహుత్వాది) ద్యోతకంగా ఏర్పడినప్పుడు ధ్వని భేదాన్ని గుర్తించాలి. ఆంగ్ల బహువచన ద్యోతక పదాలలో ఈ ధ్వని వైశిష్ట్యం కన్పిస్తోంది.

Singular	plural
man	men
woman	women
foot	feet
tooth	teeth
mouse	mice
goose	geese

5.7. సర్వాదేశ పదాంశాలు (suppletive morphemes)

ఆంగ్ల భాషలోని 'go' పదాంశం భూతార్థంలో ' went 'గా మారుతుంది. ఇది సర్వాదేశానికి ఉదాహరణ.

తెలుగులో బాలవ్యాకరణంలోని "ఇచ్చినకు సర్వంబునకీయగు" (బాలవ్యా. క్రియా. 92) అనే సూత్రప్రకారం 'ఇచ్చు' అనే ధాతువుకు 'ముత్తు' పరమయినప్పుడు 'ఇచ్చు' ధాతువుకు మారుగా మొత్తంగా 'ఈ' అనేది సర్వాదేశమవుతుంది. ఉదా: ఇచ్చు < ఈము < ఇమ్ము

5.8. శూన్య పదాంశాలు (zero morphemes)

ఏ.వ.	బ.వ.
deer	deer
fish	fish
sheep	sheep

ఇంగ్లీషులోని పై పదాలలో. ఏ.వ., బ.వ. భేదం లేదు. క్రియల్ని బట్టి గుర్తించాలి. బహువచన ప్రత్యయం చేరి లోపించిందని భారతీయ వైయాకరణుల " అదర్శనం లోపః"(అష్టా. 1-160) సూత్రాన్ని బట్టి ఆంగ్లేయులు బహువచన సమస్యను పరిష్కరించుకున్నారు. దీన్నిఎల్.బ్లూమ్‌ఫీల తమ 'భాషా' గ్రంథంలో ప్రశంసించారు.

"A single phonetic form, in the manner of homophony, represents two meanings which one usually distinguished by means of a linguistic form, as, single and plural noun in the sheep (grazes): The Sheep (graze). Here the Hindus lit upon the apparently artificial but in practice eminents serviceable device of speaking of a zero element in sheep: sheep the plural is replaced by zero - that is by nothing at all (language p.209).

శూన్యాన్ని పాణిని మహర్షి కనిపెట్టిన శూన్య ప్రత్యయంగా ఎల్.బ్లూమ్ ఫీల్డ్ మొదలైనవారు గ్రహించారని తెలుస్తోంది. పాణిని మహర్షి ప్రకారం వర్ణనాశమే కాని ప్రత్యయార్థనాశం కాదు. ప్రత్యయం శ్రవణగోచరం కాకపోయినా తత్సంబంధి వ్యాకరణ కార్యాలు జరుగుతూనే ఉంటాయి. పాణిని లోప విధానం ప్రశంసనీయం.పదపదాంశ విజ్ఞానం వాక్య విజ్ఞానానికి తోడ్పడుతుంది.

6.1.వాక్య నిర్మాణం (syntax)

నేడు సుమారు 6,500 భాషలు వ్యవహారంలో ఉన్నాయి. ఈ భాషలన్నిటీనీ పరిశీలించటానికి తగిన సాధనాలులేవు. ప్రపంచంలోని అందరికీ మాతృ భాష తెలుసు. ఒక్క భాష కూడా తెలియని మనిషి లేడు. మాతృ భాషను తప్ప వేరే (అన్య) భాషను

సమగ్రంగా తెలిసిన మనిషి కూడా లేడు. అక్షరం, ప్రత్యయం, పదం, పదబంధం, ఉపవాక్యం మొదలైనవన్నీ వాక్యంలోని భాగాలే. భాషకు వాక్యం అంతరాత్మ. భాషకు వాక్యం ప్రమాణం(sentence is the unit of language). ఇటువంటి పరిస్థితిలో ప్రకృతి ప్రత్యయాది భాషా భాగాలను మనం అధ్యయనం చేయటం ఎందుకు?

శుక్ల యజుర్వేద సంహితకు చెందిన శతపథ బ్రాహ్మణం ఈ విషయం గురించి వివరించింది.

"వాగ్వై పరాచీ అవ్యాకృతా అవదత్తే
తేదేవా ఇన్ద్రమబ్రువన్. ఇమాంనోవాచం
వ్యాకురు. తాంఇన్ద్రః మధ్యతోఽవక్రమ్య
వ్యాకరోత్. తస్మా దియంవ్యాకృతావాగుద్యతా"

(అగమ్యమయిన(వైదిక సంస్కృత) వాక్కు (భాష) వ్యాకరించబడలేదు. ఆ దేవతలు ఇంద్రుణ్ణి ఉద్దేశించి పలికారు: ఈ వాక్కును (వైదిక సంస్కృత సరస్వతిని) మాకోసం వ్యాకరించు.(అప్పుడు) ఇంద్రుడు వారి మధ్యకు దిగివచ్చి (వారికోసం) వ్యాకరించాడు. ఆకారణంచేత ఇది వాగ్దేవి (ప్రసాదం) వల్ల పుట్టినది (సిద్ధమైంది) (వైదిక సంస్కృత భాష వ్యాకరించబడ్డది). సాయనులవారి శతపథ బ్రాహ్మణ భాష్యంలో ఈ విషయం చక్కగా విశదీకరించబడింది.

"అగ్ని మీళె ఇత్యాది వాక్ పూర్వస్మిన్
కాలే, పరాచీ, సముద్రాది ధ్వని వదేకా
త్మికాసతీ, అన్యాకృతా, ప్రకృతిః, ప్రత్యయంః
పదం, వాక్యం ఇత్యాది విభాగ రహితా
ఆసీత్, తాంవాచం ఇన్ద్రః మధ్యే 2
వక్రమ్య, ప్రకృత్యాది రూపేణ విభజ్య
వ్యాకరోత్ ఇతి. ఏవంచ అసత్యా
రుంధతీదర్శనేన సత్యారుంధతీ దర్శనవతే
పంచకోశాది వ్యుత్పాదనన్యాయేన మిథ్యా
వస్తు పరిహారేణ అఖండ సచ్చిదానంద
ప్రతిబోధనవచ్చ, అసత్య భూత ప్రకృతి
ప్రత్యయార్థ నిరూపణేన సత్య భూతాఖండ
వాక్యార్థ బోధనం వ్యాకరణాదనాక్రియతే ఇతి బోధ్యమ్"

(పూర్వకాలంలో 'అగ్నిమీళే' మొదలయిన వాక్కు అవగతం కాకుండా పోయింది.

సముద్ర ధ్వనివలె కలిసిపోయి ఉంటుండగా, ప్రకృతి, ప్రత్యయం, పదం, వాక్యం మొదలైన విభాగాలు లేకుండా ఉంది. ఆ వాక్కును ఇంద్రుడు ప్రకృత్యాది రూపంలో విభజించాడు. అసత్యారుంధతీ దర్శనంచేత సత్యారుంధతిని దర్శించినట్లు, పంచకోశాది వ్యుత్పాదన న్యాయంచేత 'మిథ్యా వస్తు పరిహారంచేత అఖండ సచ్చిదానంద బోధ కలిగినట్లు అసత్యాలయిన (నిజంకాని) ప్రకృతి ప్రత్యయార్థ నిరూపణచేత వ్యాకరణం మొదలైన వాటిచేత సత్యభూతమైన అఖండమైన వాక్యార్థబోధ చేయబడుతుంది. (కలుగుతుంది)

పతంజలి మహర్షి వ్యాకరణ మహా భాష్యాన్ని రచిస్తూ "అథ శబ్దాను శాసనమ్" ఇక్కడ నుండి శబ్దాను శాసనం ఆరంభించబడుతుంది" అని తెలిపారు. శబ్దాల అనుశాసనం శబ్దానుశాసనం. సాధు శబ్దాలను అసాధు శబ్దాల నుండి వేరు చేసి చూపేది శబ్దాను శాసనం. సాధు శబ్దాల సంఖ్య అసాధు శబ్దాల సంఖ్య కంటే తక్కువ. కాబట్టి సాధు శబ్దాలను నేర్చుకోవాలి. భాష్యకారులు ఈ విషయాన్ని వివరించారు.

"గౌరిత్యస్య శబ్దస్యగా వీగోణీ గోతా
గోపోత కేత్యేవమాదయో2 పభ్రంశాः
ఇష్టాన్వఖ్యానంఖల్వపిభవతి"

(గోవు అనే శబ్దానికి గావి, గోణి, గోత, గోపోతలిక మొదలైన అపశబ్దాలెన్నో ఉన్నాయి. సాధు శబ్దోపదేశంలాఘవమే కదా). అందువల్ల ప్రతిపదసారం శబ్ద ప్రతిపత్తి విషయంలో (తప్పక) చేయతగ్గది. కాబట్టి "గౌः (ఆవు). 'అశ్వः'(గుర్రం); 'పురుషः' (మగవాడు); 'హస్తి' (ఏనుగు); శకునిः(పిట్ట); 'మృగः' (మెకం) 'బ్రాహ్మణः'(విప్రుడు) మొదలయిన శబ్దాలు అధ్యయనం చేయబడేవి. 'నేత్యాహ' (ఇది సరికాదు) అని భాష్యకారులు తెలిసి శబ్దప్రతిపత్తిలో ప్రతిపదపాఠం(పఠనం) ఉపాయం కాదు అని దాని సమర్థనకై పూర్వం జరిగిన యధార్థ వృత్తాంతాన్ని వివరించారు. "బృహస్పతి రింద్రాయ దివ్యం వర్ష సహస్రం

పతిపదోక్తానాం శబ్దానాం శబ్ద పారాయణం
ప్రోవాచ. నాన్తంజగామ. బృహస్పతిः
ప్రవక్తా. ఇంద్రశ్చ అధ్యేతా
దివ్యం వర్ష సహస్ర మధ్యయనకాలः
నచాన్తంజగామ కింపునరద్యత్వేయः
సర్వథా చిరంజీవతి వర్ష శతంజీవతి.
చతుర్భిశ్చ ప్రకారైర్విద్యోపయుక్తా భవతి – ఆగమకాలేన,

స్వాధ్యాయ కాలేన, ప్రవచనకాలేన,
వ్యవహార కాలేన ఇతి. తత్రచాస్యాగమకాలేనైవ ఆయుః
కృత్స్నం పర్యుప యుక్తంస్యాత్. తస్మాదనభ్యుపాయః
శబ్దానాం ప్రతిపత్తౌ ప్రతిపదపాఠః"
(వ్యాకరణ మహాభాష్యమ్ - పస్పశాహ్నికమ్).

(శబ్దజ్ఞానం ఇంద్రుడికి కలిగించాలనే కోరికతో బృహస్పతి దివ్య వర్ష సహస్రకాలం ప్రతి పదోక్త శబ్దాల శబ్ద పారాయణను చెప్పాడు. పూర్తికాలేదు. చెప్పేవాడు బృహస్పతి (దేవగురువు); చదువుకునేవాడు దేవతా సంవత్సరాలు. అయినప్పటికీ పూర్తికాలేదు. ఈకాలంలో ఎవడైనా జీవిస్తే వందసంవత్సరాలు (మాత్రమే) జీవిస్తాడు. నాలుగు రకాలుగా విద్యోపయుమ్తాడౌతాడు. (వేదవిద్యాధ్యయనకాలంతో, స్వాధ్యాయ కాలంతో, విద్యను (ఇతరులు) చెప్పే కాలంతోను, వ్యవహార కాలంతోను జీవితం సమాప్తం కావాల్సిఉంది. (వేద ప్రతిపదోక్త శబ్ద పారాయణతోనే ఆయువు మొత్తం పర్యుపయుక్త మవుతుంది. కాబట్టి శబ్ద ప్రతిపత్తిలో ప్రతిపదపాఠం ఉపాయంకాదు). భాషా పరిజ్ఞానాన్ని అవగతం చేసుకోవటానికి వ్యాకరణజ్ఞానం వినా వేరేదారి లేదని వైయాకరణుల నిశ్చితాభిప్రాయం.

ప్రతి మనిషికి వ్యాకరణం జన్మతః సంక్రమిస్తుంది. ఇది మానవేతర జీవులకు సంక్రమించదు. ఈ జ్ఞానం వాక్య రూపంలో ఉంటుంది. ఈ వాక్య జ్ఞానాన్ని వైయాకరణులు 'స్ఫోట'గా గుర్తించారు. ఈ విధంగా గుర్తించిన వారిలో మొట్ట మొదటివాడు పాణినికి పూర్వుడైన స్ఫోటాయనుడు (స్ఫోటమార్గవర్తి) 'ఇతడు క్రీ.పూ. 600 సంవత్సర ప్రాంతానికి చెందినవాడు. వాక్య స్ఫోటవల్ల లోకంలో భాష ప్రవర్తిస్తుందని ఈ వ్యాకర్త భావించాడు. పతంజలి మహర్షి ఈ స్ఫోటను దర్శించగా దీనిని భర్తృహరి " అనాది నిధనం బ్రహ్మ శబ్దతత్త్వం యదక్షరమ్, వివర్తతే2ర్థ భావేన ప్రక్రియా జగతోయతః" (వాక్యపదీయమ్ 1-1) అని శబ్దతత్త్వాన్ని పరబ్రహ్మ రూపంగా భావించాడు. ఈ స్ఫోటను ఛోమ్స్కి ప్రతిపాదించిన 'సామర్థ్యం' (competence)తో పోల్చవచ్చు. ఈ విషయాన్ని చోమ్స్కి 19వ శతాబ్ది ఉత్తరభాగంలో తెలపగా స్ఫోటాయన ప్రభ్రుతులు క్రీ.పూ.600 సంవత్సరం నుండి విశదపరుస్తూనే ఉన్నారు.

భారతీయులు వాక్యానికి ప్రాధాన్యమివ్వలేదనేది తప్పు మాట. వ్యాకరణ శాస్త్రంలోని కారక ప్రకరణంలో వాక్యంలోని పదాలు ఏవిధంగా ఏ కారకాలతో కూడి క్రియతో అన్వయిస్తాయో మన దేశీయ వ్యాకరణాలు విశదీకరించాయి.

6.2 తెలుగు వాక్యం

ప్రౌఢ వ్యాకర్త తన వ్యాకరణంలో 'వాక్య పరిచ్ఛేదం' ను చేర్చి వాక్యాన్ని సూత్రబద్ధం కావించాడు. "వాక్యము నాయోగ్యతాకాంక్ష సకితంబగు నర్థము గల యాసత్తి యుక్త పదసముదాయంబు" (ప్రౌఢ.వాక్య.1) అని శ్రీ బహుజన పల్లి సీతారామాచార్యులు (క్రీ.శ.1827-1891) సూత్రించి వివరించారు. పదాలకు యోగ్యత, అకాంక్ష, ఆసత్తి అనే మూడు లక్షణాలుండాలని ఆచార్యులు పై సూత్రంలో తెలిపారు. 1. యోగ్యత. వాక్యంలో పదాల అర్థాలకు, పరస్పరాన్వయంలో బాధ ఉండకూడదు. నిప్పుతో తడుపుతున్నాడు" అనే వాక్యంలో నిప్పును తడపటానికి సంబంధం లేదు. కాబట్టి ఇది వాక్యంకాదు. "నీళ్ళతో తడుపుతున్నాడు" ఇది సరైన వాక్యం. నీళ్ళకు తడపటానికి సంబంధంలో బాధలేదు. 2. అకాంక్ష: నిలుపుదల లేకుండా తర్వాతి పదాల అర్థాల మీద శ్రోతకు ఆదరం కలగాలి. "గోవు గుర్రం" అంటే శ్రోతకు వినటం పై ఏమాత్రం ఆదరం ఉండదు. కాబట్టి ఇదివాక్యంకాదు. 3. ఆసత్తి : ఆసత్తి అంటే పదాల చేరిక. నేడు 'అప్పారావు' అని చెప్పి వారం తర్వాత 'వెళ్తాడు' అని చెప్తే అధిక వ్యవధానం కారణంగా 'ఆసత్తి' లేదు. ఇది వాక్యం కాదు. అప్పారావు వెళ్తాడు అని వెంటనే పలికితే వాక్యమవుతుంది. ఈ లక్షణం ప్రపంచంలోని అన్ని భాషలకు వర్తిస్తుంది. ఇది సర్వ భాషాలక్షణం (Universal). "వాక్యంస్యాద్యోగ్యతాకాంక్షసత్తి యుక్త పదోచ్చయఃు" అనే సాహిత్య దర్పణకారుని వాక్యం ఈ ప్రౌఢ వ్యాకర్త సూత్రానికి ఆధారం.

ప్రపంచంలోని ఏ భాషలోనైనా వాక్యాలను మూడు విధాలుగా విభజిస్తారు:

1. సామాన్య వాక్యం (Simple sentences)
2. సంశ్లిష్ట వాక్యం (complex sentence)
3. సంయుక్త వాక్యం(compound sentence)

ప్రపంచంలో మొట్టమొదటి సామాన్య వాక్యాలు ఏర్పడ్డాయి. కాబట్టి మొదట వీటిని గురించి తెలుసుకుందాం.

6.2.1. సామాన్య వాక్యాలు (Simple sentence)

తెలుగు సామాన్య వాక్యాలలో కొన్ని క్రియారహిత వాక్యాలు కాగా మరికొన్ని క్రియాసహిత వాక్యాలు.

క్రియారహిత వాక్యాలు

హిందీ, పంజాబీ, బెంగాలీ మొదలయిన హిందార్య భాషలు, అనేక ఇండో

యూరోపియన్ భాషలు క్రియాసహిత వాక్యాలను ప్రధానంగా వాడుతుండగా ద్రావిడ భాషలు క్రియారహిత వాక్యాలను, క్రియసహితవాక్యాలను ఉపయోగిస్తున్నాయి.

అ) ఆమె టీచరు

ఆ) వాడు కూలి

ఇ) రామారావు ధనికుడు

ఈ) కృష్ణారావు వైద్యుడు

ఉద్దేశ్యం సర్వనామం కావచ్చు, నామవాచకం కావచ్చు. పైఉదాహరణల్లో మొదటి రెండూ సర్వనామాలుగా తర్వాతి రెండూ నామవాచకాలు విధేయానికి ముందు విశేషణం లేదా విశేషణాలు ఉండవచ్చు.

అప్పారావు మంచివాడు. ఇందులో విధేయానికి ముందు 'మంచి' విశేషణం వచ్చింది తెలుగు సామాన్య వాక్యాలలో విధేయస్థానంలో విశేషణాలుండటం విశేషం

'సర్వేశ్వరరావు నాకు కొత్త'

ఇక్కడ 'కొత్త' విధేయస్థానంలో ఉండి విశేష్యార్థాన్నిస్తోంది.

క్రియాలోపంవల్ల క్రియారహిత వాక్యాలు ఏర్పడతాయి:

అ) నీకు తమ్ముళ్ళు ఎంతమంది?

ఆ) వాడికి ఇద్దరు అన్నలు

పైవాక్యాలలో ఉండు 'క్రియా రూపాలు లోపించాయి.

క్రియాసహిత వాక్యాలు

1. రామారావు ఇంటికి వెళ్ళాడు

2. అమ్మాయి అన్నం తింది.

ఈ వాక్యాలలో 'వెళ్ళు, తిను' అనేవి క్రియలు. తెలుగులో ఉద్దేశ్యాన్ని గుర్తించటం తేలిక. తెలుగు వాక్యంలో ఉద్ధేశ్యం మొదటవస్తుంది.

1. నాకు అలసటగా ఉంది.

2. సుబ్బారావు భయపడుతున్నాడు

ఈ పై వాక్యాలలో నాకు, సుబ్బారావు పదాలు ఉద్దేశ్యాలు.

"తలుపు మూసి ఉంది, గడియవేసి ఉంది"

అనే సామాన్య వాక్యాలలోని ఉండు'

క్రియాస్థితి ద్యోతకం.

6.2.2. సంశ్లిష్ట వాక్యాలు (complex sentences)

ఒక ప్రధాన వాక్యానికి మరికొన్ని వాక్యాలను లేదా మరో వాక్యాన్ని చేర్చటంవల్ల సంశ్లిష్ట వాక్య మేర్పడుతుంది. సంశ్లిష్ట వాక్యంలో రెండు లేదా అంతకంటే ఎక్కువ క్రియలుంటాయి. తెలుగు సంశ్లిష్ట వాక్యం క్ష్వార్థక సహితంగా ఉంటుంది. ఉదా : 1. సీత అన్నంతిని నిద్రపోయింది. 2. సీత అన్నం తినింది, తర్వాత నిద్రపోయింది. ఈ వాక్యం రెండు వాక్యాల సమాహార రూపం.

చేదర్థకాది ప్రయోగాలవల్ల తెలుగులో సంశ్లిష్ట వాక్యాలేర్పడతాయి.

నీవు అన్నంతింటే నేను నిద్రపోతాను.

ఈపై వాక్యాంలో తిను, పోవు రెండు క్రియా ధాతువులున్నాయి. కాబట్టి ఇది సంశ్లిష్ట వాక్యం.

6.2.3. సంయుక్త వాక్యాలు (compound sentences)

రెండుకాని అంతకంటే ఎక్కువ వాక్యాలు కలిసి ఒక వాక్యంగా ఏర్పడటం ఈ సంయుక్త వాక్య లక్షణం. సంయుక్త వాక్యాలను సూచించటానికి ఆంగ్ల భాషలో but, or, and హిందీ భాషలో ఔర్, యా, మగర్ వంటి శబ్దాలను ప్రయోగిస్తారు. తెలుగు భాషలో రెండు వాక్యాలను కలిపే ప్రత్యేక పదంలేదు. తెలుగులోని 'మరియు' పదం కేవలం కల్పితం.

ఉదా : ఉమ అందమైనదీ, ఉమ తెలివైనదీ.

(ఆ) ఉమ తెలివైనదీ, అందమైనది

పై వాక్యాలలోని రెండోది సంయుక్త వాక్యం. తెలుగులో సంయుక్త వాక్యాల ప్రయోగాలు విరళం.

తెలుగు వాక్యాలలో కర్మణీ ప్రయోగాలు తక్కువ. ప్రాఙ్నన్నయ యుగంలో కర్మణీ ప్రయోగాలు మూడు మాత్రమే. కర్త ఎవరో తెలియనప్పుడు కర్మణి ప్రయోగం చేస్తారు. కృష్ణారావు చంపబడ్డాడు. కృష్ణారావును ఎవరు చంపారో తెలియదు. అపుడు ఈ ప్రయోగం కర్మణి (-కర్మణి పూర్తిగా నిరుపయోగాలు కావు.)

ఉపయుక్త గ్రంథసూచి

1. అప్పలాచార్య, శ్రీభాష్యం1969, పతంజలి మహాభాష్యము, పస్యశాహ్నికము మహీధర జగన్మోహనరావు, రాజమండ్రి-2
2. భద్రిరాజు కృష్ణమూర్తి, (సంపాదకులు) 2000, తెలుగు భాషాచరిత్ర శ్రీపొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు.

3.చక్రధరరావు లకంసాని- 1968, శాస్త్ర వ్యాసములు ఆంధ్రవిశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

4. పరవస్తు చిన్నయసూరి, - 1964, బాల వ్యాకరణం.
శ్రీ దువ్వూరి వేంకటరమణ శాస్త్రి - రమణీయ వ్యాఖ్యానము, విశాఖపట్నం.

6.గంటిజోగి సోమయాజి - 1947, ఆంధ్రభాషా వికాసము, వాల్తేరు.

7. కోరాడ,రామకృష్ణయ్య - 1948, భాషోత్పత్తిక్రమము-భాషా చరితము వావిళ్లరామ శాస్త్రులు అండ్‌సన్స్, మద్రాసు-5.

8.కోరాడ రామకృష్ణయ్య, - 1956, సంధి తిరువళిక్కేణి, మద్రాసు-5.

9.చేకూరి రామారావు,1999 తెలుగు వాక్యం-పదవర్ణసహితం, నవయుగ బుక్‌హౌస్. ఆర్యసమాజ్ మందిర్‌కు ఎదురుగా,కాచిగూడ,హైదరాబాదు.

10. బహుజనపల్లి సీతారామాచార్యులు, 1975, ప్రౌఢ వ్యాకరణము, ఘంటాపథ వ్యాఖ్యానము,శ్రీ వంతారాం రామకృష్ణారావు, తణుకు, పశ్చిమ గోదావరి జిల్లా.

11. పి.యస్.సుబ్రహ్మణ్యం, 1997, ద్రావిడభాషలు, శ్రీ పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు-4.

Bibliography

Bernard Block and Georg L. Trager 1942. An outline of Linguistic Analysis. Linguistic Society of America.

Bloomfield, Leonard, 1933. Language, New York: Henry Holt.

Burrow, it and Emeneau, M.B.1984. A Dravidian Etymological Dictionary, Carendon Press, Oxford, London.

Chomsky Naom, 1957. Syntactic Structures. The 'Hague Mouton'.

Chomsky, 1965. Aspects of the Theory of syntax, cambrige, Mass. M.I.I. Press. United Kingdom.

Krishnamurti, Bh. 2003. The Dravidian Languages. Cambridge University Press. United Kingdom.